## ఆర్ఎంపీ డాక్టర్ ఆత్మహత్యాయత్నం

- బాసర గోదావరిలో దూకిన సంతోష్

**నవతెలంగాణ-నవీపేట్**

బాసర్ గోదావరిలో రెంజల్ మండలం కూనేపల్లికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు సంతోష్ సోమవారం ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. గోదావరి బ్రిడ్జి కిందికి వెళ్లి లొకేషన్ షేర్ చేసి తాను ఆత్మహత్య చేసుకోనున్నట్లు వీడియో పంపగా సర్పంచ్ భర్త ప్రవీణ్ కుమార్ వెంటనే స్పందించి గ్రామస్తులను అక్కడికి పంపగా గోదావరిలోకి దూకి అతన్ని రక్షించారు. బాసర మండలంలోని కౌట గ్రామంలో ఆర్.ఎం.పి వైద్యుడిగా చిట్టీ వ్యాపారం కొనసాగిస్తున్నాడు. ఆత్మహత్యకు ఆర్థిక వ్యవహారలే కారణమని తెలుస్తోంది.


ఆర్ఎంపీ డాక్టర్‌ను రక్షించిన స్థానికులు

## అల్లాపూర్‌లో చిరుత సంచారం

**నవతెలంగాణ-నవీపేట్**



మండలంలోని యంచ గ్రామపంచాయతీ అల్లాపూర్ గ్రామంలో చిరుత సంచారంపై అటవీశాఖ నార్త్ రేంజ్ అధికారి పద్మారావు, సెక్షన్ అధికారి జహూర్ ఉల్ హక్ సోమవారం పరిశీలించారు. చిరుత పులి పాద ముద్రలను పరిశీలించి గుర్తించారు. పాద ముద్రల ఆధారంగా చిరుత వయస్సు ఎక్కువగా ఉంటుందని పెద్దలు, పిల్లలు రాత్రిపూట ఒంటరిగా బయటికి వెళ్ళవద్దని సూచించారు. వృద్ధ చిరుత కావడంతో పశువులను రాత్రిపూట రక్షించుకోవాలని అతిగా భయపడాల్సిన అవసరం లేదని సూచించారు. ఉన్నత అధికారుల ఆదేశాలు అందిన వెంటనే బోన్ ఏర్పాటు చేస్తామని రేంజ్ అధికారి పద్మారావు తెలిపారు. చిరుత పులి సంచారంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని వెంటనే అటవీ శాఖ అధికారులు స్పందించి ప్రజల, పశువుల ప్రాణాలను రక్షించాలని ప్రవీణ్ కుమార్ కోరారు. అధికారుల వెంట బీట్ అధికారిని సౌమ్య, నాగురావు గ్రామ పెద్దలు ఉన్నారు.

# అర్ధరాత్రి నుంచి ఏకధాటివర్షం


నిజాంసాగర్ ఐదు గేట్లు ఎత్తివేయడంతో ఉరకలేస్తున్న మంజీరా

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల భారీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- వాగులకు, ప్రాజెక్టులకు వరద

**నవతెలంగాణ-విలేకరులబృందం**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. అర్ధరాత్రి మొదలై.. తెల్లవారు జాము వరకు భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. కాలువలకు, ప్రాజెక్టులకు వరద ఉధృతి నెలకొంది. పలుచోట్ల వరదనీటి దాటికి పంటపొలాలు నీటమునిగాయి. లింగంపేట్‌లో పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తుంది. వాగు అవతల ముగ్గురు చిక్కుకున్నారు.

**కంఠేశ్వర్ :** నిజామాబాద్ జిల్లాలో 40 రోజుల తర్వాత భారీ వర్షం కురిసింది. ఎండలు వర్షాకాలంలో ఉక్కిరిబిక్కిరి చేస్తున్న తరుణంలో వర్షాలు కురవడంతో రైతులతో పాటు సాధారణ ప్రజలకు ఉప శమనం కలిగించింది. నిజామాబాద్ జిల్లాలో శనివారం నుంచి ఆదివారం ఉదయం వరకు 260 మి.మీ వర్షం కురిసింది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జిల్లాలోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పలు వాగుల్లోకి నీరు చేరి మత్తళ్లు పోస్తుండగా భీముని పాదం జలపాతం వద్ద వాటర్ ఫాల్స్ ఉధృతంగా పడుతోంది. వాగుల వద్ద నీరు పొంగి ప్రవహిస్తుండడంతో పోలీసులు, రెవెన్యూ, ప్రజాప్ర తినిధులు సైతం పలు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. వాగుల వద్ద బారీకేడ్లతో పాటు ట్రాక్టర్లను అడ్డం పెట్టి ప్రజలు వాగు దాటకుండా చర్యలు చేపడు తున్నారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ బైపాస్ ప్రాంతంలో అపార్ట్‌మెంట్ వెనుక ఉన్నటువంటి మోరి మూతపడడంతో నీరు వెళ్లలేక కాలనీ మొత్తం జలమయమై ఇండ్లలోకి నీరు వెళ్లి చేరింది. అలాగే చంద్రశేఖర్ కాలనీ రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఉమెన్స్ కాలేజీ చౌరస్తా ప్రాంతంలో కూడా నీరు రోడ్డుపై చేరి జలమయమయ్యింది.


లింగంపేట్‌లో పెద్దవాగు ఉధృతికి కొట్టుకుపోయిన నాగారం బ్రిడ్జి


రెంజల్ : కందకుర్తి వద్ద గోదావరిలో నీటమునిగిన శివాలయం

### వరద ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే

**ఆర్మూర్ :** పట్టణ కేంద్రంలో ఆది, సోమవారాల్లో కురిసిన భారీ వర్షాలతో పట్టణంలో వరద పోటెత్తింది. పట్టణంలోని ప్రధాన జాతీయ రహదారిపై మలన్న గుడి ఏరియాలో భారీగా నిలిచిన వరద ప్రాంతాల్లో సోమవారం ఎమ్మెల్యే జీవన్ రెడ్డి పరిశీలించారు. భారీ వర్షాలతో ప్రధాన జాతీయ రహదారిపై నిలిచిన వరద నీరును త్వరిత గతంగా క్లియర్ చేసేలా చర్యలు చేపట్టాలని మున్సిపల్, రోడ్లు భవనాల శాఖ అధికారులకు ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆదేశించారు. ఆయన వెంట నాయకులు ఆశన్న గారి రాజేశ్వర్ రెడ్డి, ఆకుల రజనీష్, తదితరులు ఉన్నారు.

**ఎడపల్లి :** గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలకు గాను ఎడపల్లి మండలంలో 6.5 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

### త్రివేణీ సంగమం వద్ద గోదావరికి వరద ఉధృతి

**రెంజల్ :** నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం కందకుర్తి గోదావరి త్రివేణి సంగమం లో సోమవారం నీటి ప్రవాహం పెరిగింది. కందకుర్తి గోదావరి లోనున్న శివాలయం నీటిలో మునిగిపోయింది. మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు గోదావరి పరివాహక ప్రాంతం నుంచి వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో గోదావరిలో నీటి ప్రవాహం పెరిగింది.

**రామారెడ్డి :** మండలంలో గత కొన్ని రోజుల నుండి ఎండ, ఉక్కపోతుతో ప్రజలు ఇబ్బంది పడుతుండగా, బంగాళాఖాతంలో అల్పపీడనంతో రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలతో కుంటలు, వాగుల వంకలు పొంగిపొర్లాయి, మండలంలో సోమవారం 97.2 ఎమ్ ఎమ్ వర్షపాతం కురిసినట్లు అధికారులు తెలిపారు.

### పొంగిపొర్లుతున్న వాగులు, తూములు

**నసురుల్లాబాద్ :** బాన్సువాడ మండలంలో 101 మిమి మీటర్ల వర్షం కురియగా నసురుల్లాబాద్ మండలంలో 66 బీర్కూర్ లో 96 మిల్లి మీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో మండల కేంద్రంలోని రోడ్లన్నీ జలమయమయ్యాయి. బీర్కూర్ మండల కేంద్రంలో సంగం శివ కు చెందిన నివాస ఇల్లు కూలిపోయింది. బీర్కూర్ బాన్సువాడ వెళ్లే రహదారి పై వరద నీరు వచ్చి చేరింది. చెరువులు పొంగిపొర్లుతున్నాయి.

మిర్జాపూర్ గ్రామంలో ఉర చెరువులు పొంగిపొర్లుతున్నాయి. నాచుపల్లి శివారులో నాటు వేసిన పొలాలు చెరువు కుంటల మారినాయి. పొలం నాటిన రెండు రోజులకే భారీ వర్షం కురియడంతో పొలాలు పూర్తిగా నీటితో నిండి పోయాయి. మండలంలోని ఉన్న కొన్ని చెరువులు ఈ భారీ వర్షం నిండి తూములు పొర్లుతున్నాయి. బీర్కూర్ మండల కేంద్రంలో పలు విధుల్లో కి వరద నీరు వచ్చి చేరింది.

### అవసరం ఉంటే తప్ప బయటకి రాకూడదు..

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే తప్ప ఇళ్ల నుండి బయటకు రావద్దని నసురుల్లాబాద్, బీర్కూర్ మండల తహసీల్దార్లు రాజు, జనార్ధన్ సోమవారం ప్రజలకు సూచించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మరో మూడు రోజులు భారీ వర్షాలు ఉన్నందున పురాతన ఇళ్లలో ఉన్నవారు అప్రమత్తంగా ఉండాలని, వర్షంలో విద్యుత్ పరికరాలకు ప్రజలు దూరంగా ఉండాలని సూచించారు.

### కూలిన ఇల్లు..

**తాడ్వాయి :** తాడ్వాయి మండలంలోని నందివాడ పిల్ల ఒర్రె వాగు, కన్కల్ వాగు, కాలోజివాడి వాగు, బ్రాహ్మణపల్లి వాగులు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచిపోయాయి. భీమేశ్వర వాగు, ఎర్ర పహాడ్ పెద్ద వాగు ఉధతంగా ప్రవహిస్తున్నాయి. పంట పొలాల్లోకి నీళ్లు చేరడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు లేక పంటలు ఎండిపోతాయి అనుకుంటే వర్షాలు అధికం కావడంతో పంటలు కుళ్ళిపోయే ప్రమాదం ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నందివాడ గ్రామంలో నీరడీ సాయిల్‌కు చెందిన నివాస ఇల్లు పాక్షికంగా కూలిపోయింది. కన్కల్ గ్రామం నుంచి కామారెడ్డికి పాలు తీసుకు వెళ్ళడానికి వచ్చిన వ్యాను నీటి ప్రవాహంలో రాలేకపోవడంతో ట్రాక్టర్‌తో పాలను తరలించారు. బ్రాహ్మణపల్లి వాగు ఉదతంగా ప్రవహిస్తుండడంతో కామారెడ్డికి రాక పోకలు నిలిచిపోయాయి. మండలంలోని చెరువులు, కుంటలు నిండుకుండల్లా నిండిపోయాయి.

### ఇండ్లలోకి చేరిన వర్షపు నీరు



**బోధన్ టౌన్ :** బోధన్ పట్టణంలోని 16వ వార్డులో గత 2 రోజులుగా కురుస్తున్న వర్షాలకు డ్రైనేజీ, సీసీరోడ్డు లేక వర్షపు నీరు ఇళ్లలోకి చేరాయి. సోమవారం ఉదయం కాంగ్రెస్ పార్టీ నాయకులు వార్డును సందర్శించారు. 2 రోజులుగా నిద్రలేని రాత్రులు గడిపినట్లు స్థానికులు తెలిపారు. కాలనీలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారాలకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

**సదాశివనగర్ :** మండలంలో రెండు రోజుల కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమై.. ఇండ్లల్లోకి నీరు వచ్చి చేరింది. మండలం లోని పద్మాజివాడి చౌరస్తాలోని బెజుగాం ప్రకాష్ ఇల్లు నీట మునిగింది. అమర్లబండ గ్రామానికి వర్షంతో రాకపోకలు నిలిచిపోయాయి. రెండు గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

### నీటమునిగిన పొలాలు


పొలంలో ఇసుక మేటలు


**సదాశివనగర్ :** మండలంలో రెండు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు పొంగి పోర్లుతున్నాయి. పంటలు నీట మునిగి పోయాయి. మరికొన్ని పంటలపై మట్టి పేరుకుపోయింది. పొలాలలోని పొలం గట్లు తెగిపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షలతో రైతులు ఒక దిక్కు సంతోషంగా ఉన్నా.. భారీ వర్షాతో గండ్లు పడి ఆందోళన చెందుతున్నారు.

## ప్రాజెక్టులకు పోటెత్తిన వరద

- ఎస్సారెస్పీ రెండు గేట్లు, నిజాంసాగర్ ఐదు గేట్లు ఎత్తివేత

**నవతెలంగాణ-ముప్కాల్(మెండోరా)/నిజాంసాగర్/ఎల్లారెడ్డి**

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్ట్ గేట్లను ఎత్తి గోదావరిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ ఎగువ ప్రాంతాల్లో పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులోకి 19,540 క్యూసెక్కుల వరదనీరు రావడంతో ప్రాజెక్ట్ నుంచి రెండు వరద గేట్లను ఎత్తి 5,460 క్యూసెక్కుల నీటిని దిగువకు గోదావరిలోకి విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్ట్ ఎస్‌ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉదయం 10:30 గంటల ప్రాంతంలో 4 గేట్ల ద్వారా నీటిని విడుదల చేశారు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో 2 గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్ట్ నుండి ఎస్కేప్ గేట్ల ద్వారా గోదావరిలోకి 5 వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వారా 3 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువకు 300 క్యూసెక్కులు, అవిరి రూపంలో 628 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 152 క్యూసెక్కుల నీటిని జౌట్ ఫ్లో ద్వారా విడుదల కొనసాగుతుందని వివరించారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091 అడుగుల 90 టీఎంసీల సామర్థ్యం కాగా, మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్ నీటి మట్టం 1091 అడుగుల 90.3 టీఎంసీల నీటి నిల్వ ఉందని పేర్కొన్నారు.


ఎస్సారెస్పీ నుంచి..

**నిజాంసాగర్ :** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలకు ఇరు జిల్లాల్లోని ప్రాజెక్టులకు వరద నీరు పోటెత్తింది. నిజాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద ఉధృతి పెరిగింది. ఎగువ కురిసిన భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టుకు 36 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో ఐదు గేట్లు ఎత్తి దిగువకు 30 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు మంజీరాలోకి విడుదల చేస్తున్నట్టు ప్రాజెక్ట్ ఎఈ శివ తెలిపారు.

ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 17.80 టీఎంసీ లు కాగా ప్రస్తుతం 16.90 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. ఎగువ ప్రాంతం నుండి వస్తున్న వరద ఉధృతికి తగ్గట్టు అదే స్థాయిలో నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు తెలిపారు. వరద ఉధృతి పెరిగితే.. మరిన్ని గేట్లు ఎత్తివేయనున్నట్టు తెలిపారు. కావున దిగువ ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు, పశువుల కాపరులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.


కల్యాణి ప్రాజెక్టు నుంచి నీటి విడుదల

### కల్యాణి ప్రాజెక్ట్ మూడు గేట్లు ఎత్తివేత

**ఎల్లారెడ్డి :** గత రెండు రోజుల నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి ప్రాజెక్టుకు నీటి వరదా పెరగటంతో కల్యాణి ప్రాజెక్ట్ మూడు గేట్ల ద్వారా క్రిందికి నీటిని వదులుతున్నట్లు ఇరిగేషన్ ఏ ఈ శివ ప్రసాద్ తెలిపారు.


వర్షం తగ్గినా.. రైల్వేస్టేషన్‌లో నిలిచిన నీరు


లింగంపేట్ : ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దవాగు

### పెద్దవాగు నీటిలో చిక్కుకున్న రైతులు క్షేమం

**లింగంపేట్ :** లింగంపేట్ మండలంలోని పర్మల్ల గ్రామానికి చెందిన ముగ్గురు రైతులు గ్రామ సమీపంలోని పెద్దవాగు వద్ద పంట పొలాల వద్దకు వెళ్లారు. గంట గంటకు పెద్దవాగు ప్రవహించడంతో ముగ్గురు రైతులు ఆరేడి రవి, ఈర్ల గోపాల్, ఈర్లకిష్టయ్య పొలాల వద్ద చిక్కుకుపోయారు. గ్రామస్తులకు ఫోన్లో సమాచారం అందించారు. పెద్ద వాగు నీటి ప్రభావం పెరగడంతో రైతులు అరుపులు కేకలతో వణుకుతూ మమ్మల్ని కాపాడాలని వేడుకున్నారు. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించగా ఎల్లారెడ్డి డిఎస్పి శ్రీనివాస్, సిఐ శ్రీనివాస్, లింగంపేట్ ఎస్సై ప్రభాకర్‌తో పాటు రెవెన్యూ అధికారులు అక్కడికి చేరుకున్నారు. పెద్దవాగు నీటిలో చిక్కుకున్న ముగ్గురు రైతులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. దీంతో కుటుంబ సభ్యులు రైతులు ఊపిరి పీల్చుకున్నారు.


వాగు అవతల చిక్కుకున్న రైతులు

## వరద ఉధృతికి రాకపోకలు బంద్

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్/డిచ్‌పల్లి/మాక్లూర్**

మండలంలోని వాగులు వంకలు పొంగిపొర్లుతున్నాయి. ఆదివారం నాడు రాత్రి భారీ వర్షం కురవడంతో ఎగువ ప్రాంతం నుండి వచ్చిన వరద నీటి ప్రవాహంతో పోచారం గ్రామం వాగు లో లెవల్ వంతెన పై నుండి వరద నీరు ఉధృతికీ రాక పోకలు నిలిచిపోయాయి. సోమవారం మధ్యాహ్నం వర్షం తగ్గుముఖం పట్టడంతో జనాలకు రాకపోకలు కొనసాగించారు.


మాక్లూర్ : తెగిన అమ్రాద్ వెళ్లే రోడ్డు

**డిచ్‌పల్లి :** డిచ్‌పల్లి మండలం లోని నడ్పల్లి గ్రామ సమీపంలోని నిజామాబాద్ -హైదరబాద్ రాహదరి పెట్రోల్ బంక్ వద్ద గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గాను రాహదరిపై నుండి వర్షపు నీరు ఎక్కువ సంఖ్యలో ప్రవహిస్తుండడంతో రాకపోకలను దారి మళ్లించారు.

### సంస్థాన్ సిర్నాపల్లిలో

ఇందల్ వాయి మండలంలోని సంస్థాన్ సిర్నపల్లి గ్రామం సమీపంలో పెద్ద చెరువు నిండుకుండలా నిండి ప్రవహిస్తుం డడంతో ఇతర గ్రామాల నుండి సిర్నపల్లికు వెళ్లే బ్రిడ్జిపై నుండి నీరు ఉధృతంగా ప్రవహిస్తుడటంతో రాకపోకలను బంద్ చేయించినట్లు సర్పంచ్ తేలు విజయ్ కుమార్ నవ తెలంగాణకు తెలిపారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్న నేపథ్యంలో వాటర్ ఫాల్స్ వద్ద కు ఎవరికి వెళ్ళ కుండా జాగ్రత్తలు పడుతు న్నారు. డిచ్‌పల్లి, ఇందల్ వాయి మండలాల పరిధిలో ఉన్న చెరువులు, కుంటలు నిండు కుం డలా నిండిపోయిందని ప్రస్తుతం ఏలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారని తహసీల్దార్‌లు వెంకట్రావు వివరించారు. ఇందల్ వాయి నుండి దర్పల్లి సిరికోండ బీమ్ గల్ కు రాకపోకలు సాగించే వారికి దారి మళ్లించారు. అయా చోట్ల గ్రామ పంచాయతీ ట్రాక్టర్ లను ఇరువైపులా పెట్టి పోలీసులు ప్రజలకు ఇటు అటు రాకుండా చూస్తున్నారని ఎస్ ఐ మహేష్, తహసిల్దార్ వెంకట్రావు తెలిపారు. పలు గ్రామాల్లో ఎంపిడిఓ డిచ్ పల్లి,ఇందల్ వాయి ఎంపిడిఓ లు టీవీఎస్ గోపి బాబు, రాములు నాయక్,ఎంపిఓ రాజ్ కాంత్ రావు,మండల రెవెన్యూ అధికారులు మోహమ్మద్ వాహిద్, శ్రీకాంత్ తోపాటు తదితరులు స్థితి గతులను పర్యవేక్షించి పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇచ్చారు.


పెద్దకొడప్‌గల్ : నీటమునిగిన పోచారం లో లెవల్ వంతెన


సిర్నాపల్లికి వెళ్లే దారిలో పెద్దచెరువు వాగు ఉధృతి

### తెగిన రోడ్డు

**మాక్లూర్ :** మండలంలోని అమ్రాద్ తండా వెళ్ళే రోడ్డు ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి తెగిపోయింది. తండా వసూలు గుట్ట ప్రాంతంలో ఉండటంతో రాకపోకలు బంద్ అయ్యాయి. తెగిన రోడ్డుపై చెక్కలు వేసుకొని ఒక్కరూ ఒక్కరుగా మెల్లిగా దాటుతున్నారు. ప్రమాదపు అంచున ప్రజలు తెగిన రోడ్డుపై దాటుతున్నారు. గతంలో కూడా ఈ రోడ్డు తెగిన నామమాత్రంగానే పనులు చేసి వదిలేయడంతో మళ్ళీ తెగినట్లు స్థానికులు తెలిపారు. రోడ్డు తెగిన పక్కనే రైల్వే కమాన్ కింద నీరు నిలువడంతో తండా వసూలు రైల్వే పట్టల పై నుంచి నడుస్తూ ప్రక్క గ్రామాలను వెళుతున్నారు. తండా వాసులు తండాను దాటాలంటే ప్రమాదంతో ప్రయాణం చేస్తున్నారు.

## సమస్యలు పరిష్కరిస్తేనే ప్రజల నుంచి మన్ననలు

- ప్రజావాణి వినతుల పట్ల అడిషనల్ కలెక్టర్

**నవతెలంగాణ-కామారెడ్డి**

ప్రజల సమస్యలను సావధానంగా విని పరిష్కరించిన వారే మన్ననలు పొందగలుగుతామని, ఆ దిశగా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ పరిష్కార దిశగా కృషి చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో డిఆర్‌డిఓ సాయన్న, కలెక్టరేట్ ఏ.ఓ. సయ్యద్ మసూద్ అహ్మద్ లతో కలిసి సమస్యల పరిష్కార నిమిత్తం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదీదారుల సమస్యలను సావదానంగా వింటూ పరిష్కరింపదగిన వాటిపై తగు చర్యకై అధికారులకు అట్టి వినతులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరింప దగిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని వాటికి పరిష్కార మార్గాలు సూచించాలని అన్నారు. ప్రజావాణిలో వివిధ శాఖలకు సంబంధించి 24 వినతులు వచ్చాయి. అందులో ప్రధానంగా భూ సమస్యలు, భూ సర్వే, ధరణికి సంబంధించిన ఎక్కువ వినతులు వస్తున్నాయని, మండల స్థాయిలో తహశీల్దార్లు వాటి పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. సంబంధిత అధికారులు కూడా ప్రజావాణిలో వచ్చే వినతులకు ప్రాధాన్యతనిచ్చి పరిష్కరిస్తూ ఆన్ లైన్ లో అప్ డేట్ చేయాలన్నారు.


ప్రజావాణిలో ప్రజల వినతులు స్వీకరిస్తున్న అధికారులు

## ఓటరు నమోదుకు షార్ట్ ఫిలిమ్ తీయండి

**కలెక్టర్ జితేశ్ వి పాటిల్**

**నవతెలంగాణ-కామారెడ్డి**

ప్రజలలో ఓటరు నమోదును ప్రోత్సహించడానికి సృజనాత్మకతకు అనుగుణంగా చక్కటి పోస్టర్, చిన్న నిడివి గల వీడియో రూపొందించి పంపాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి జరాజుజుక్మీఉచీ జక్మజూా-ుఎఉచీ-2023 పేర పౌరులు తమ పేరు ఓటరు జాబితాలో ఉన్నదో లేదో తెలుసుకొని ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకునేలా ప్రోత్సహించుటకు సులభంగా అర్థమయ్యే రీతిలో రూపొందించిన పోస్టర్, 60 సెకండ్ల నిడివి గల వీడియోల కోసం ఎంట్రీలు ఆహ్వానిస్తున్నదని తెలిపారు. అయితే చిహ్నాలు, రంగులు, నాయకులు మొదలైన రాజకీయ అర్థాలతో కూడిన ఎంట్రీలు పరిగణింపబడవని స్పష్టం చేశారు. తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూ ఏ భాషలోనైనా పోస్టర్, వీడియో రూపొందించి పంపవచ్చని, విజేతలకు 20 వేల నగదు బహుమతి కూడా అందజేయనున్నట్టు తెలిపారు. ఈ నెల 16 లోగా తమ ఎంట్రీలను https://tinyurl.com/election-crea-thon 2023 వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో సమర్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

## డప్పుల పంపిణీ

**నవతెలంగాణ-మోర్తాడ్**

మండలంలోని వడ్యాట్ గ్రామానికి చెందిన 20 మంది హరిజనులకు సోమవారం డప్పులు పంపిణీ చేశారు. కీర్తిశేషులు పెండం చిన్న గంగారం జ్ఞాపకార్థం తన కుమారుడు పెండెం శ్రీనివాస్ 20 మంది హరిజన డప్పు కళాకారులకు డప్పులను వితరణ చేశారు. కార్యక్రమంలో ముత్యాల శ్రీనివాస్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.



దప్పులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

## భారీ వర్షంలోనూ ఆగని అన్నదాన సేవ

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరంతరం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం సోమవారం భారీ వర్షంలోను వారి సేవలను కొనసాగించారు. ఇందూరు క్యాన్సర్ ఆస్పత్రి రోగులకు వారి సహాయకులకు అనంతరం రోడ్లపై నిస్సహాయ స్థితిలో ఉన్న అనాథలకి మతిస్థిమితం లేనివారికి, నిరాశ్రయులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించామని సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు తెలిపారు. వర్షంలోనూ నిరాశ్రయుల ఆకలి తీర్చడం గొప్ప విషయం అన్నారు.



రోగులకు అన్నదానం చేస్తున్న సాయిబాబు

## నిజామాబాద్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ యూనియన్ నగర కార్యవర్గం ఎన్నిక

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

నిజామాబాద్ బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నూతన కార్యవర్గాన్ని, నాందేవ్ వాడలో జరిగిన విస్తృత సమావేశంలో 15 మందితో నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా మల్యాల గోవర్ధన్, అధ్యక్షులుగా షేక్ ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శిగా ధ్యారంగుల కృష్ణ, కోశాధికారిగా నల్వాల నరసయ్య, ఉపాధ్యక్షులుగా మునీర్ అహ్మద్, భాస్కర్, అఖిల్, సహాయ కార్యదర్శులు మునావర్, సునీత, గురు స్వామిని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా రిజ్వాన్, శోభ, మునావర్, నిజాముద్దీన్, తిమ్మయ్య తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.




షేక ఇబ్రహీం ద్యారంగుల కృష్ణ

## ఆర్థిక సహాయం అందజేత

**నవతెలంగాణ-ఆర్మూర్**

పట్టణానికి చెందిన లావణ్య, అశోక్ దంపతుల కూతురు ఐశ్వర్య గత కొంతకాలంగా బ్రెయిన్‌కి సంబధించిన వ్యాధి తో బాధపడు తుంది. ఈ విషయం తెలుసుకున్న పైడి రాకేష్ రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ పైడి సుచరిత రెడ్డి సోమవారం జిల్లా కేంద్రంలోని లోని చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి 15వేల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. ఐశ్వర్యకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. కార్యక్రమంలో సురేష్ రెడ్డి,భుమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుచరితరెడ్డి

## శ్రీసాయి పాఠశాలను సీజ్ చెయ్యాలి

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

నిజామాబాద్ నగరంలో అనుమతి లేకుండా కమర్షియల్ భవనంలో నడుస్తున్న శ్రీసాయి పాఠశాలను సీజ్ చెయ్యాలని తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక నాయకులు సోమవారం జిల్లా విద్యాశాఖాధికారి న హా వ రింట్ె ండె ంట్ నాగేశ్వరరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రమావత్ లాల్ సింగ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ అనుమతి లేకుండా కమర్షియల్ భవనంలో ఒకే హాలులో శ్రీసాయి పాఠశాల తరగతులు నడిపిస్తున్నారని అన్నారు. భవనానికి మున్సిపల్ యన్.ఓ.సి, సానిటైజెషన్ అనుమతి మరియు ఫైర్ సేఫ్టీ అనుమతి లేకుండా నడుస్తున్న శ్రీ సాయి పాఠశాలను సీజ్ చెయ్యాలని అలాగే పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను మరో పాఠశాలకు చేర్చే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టివియువి జిల్లా అధ్యక్షులు అజయ్, నగర అధ్యక్షుడు సుభాష్, భాస్కర్ పాల్గొన్నారు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## జూనియర్ ఏషియా కప్ భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన

- క్రీడాకారులకు ఘనస్వాగతం



స్వాగతం పలుకుతున్న సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు, కళాశాలవారు

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

గత నెల 29 నుండి ఈనెల 3 వరకు చైనా దేశంలో జరిగిన ఏషియన్ జూనియర్ అండర్ 18 ఉమెన్స్ సాఫ్ట్ బాల్ పోటీలలో పాల్గొని సోమవారం కళాశాలకు వచ్చిన సందర్భంగా జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్, కళాశాల యజమాన్యం, విద్యార్థులు ఘనంగా స్వాగతం పలికారు.ఈ సందర్భంగా మండలంలోని సుద్దపల్లి కళాశాలలో జరిగిన అభినందన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు వి ప్రభాకర్ రెడ్డి హాజరై క్రీడాకారులకు ఘన స్వాగతం పలికి మాట్లాడారు. భవిష్యత్తులో ఒలంపిక్స్ స్థాయిలో క్రీడాకారులు ఎదిగేలా తీర్చిదిద్దుతామన్నారు. పాఠశాల, కళాశాల ప్రిన్సిపల్ గోదావరి మాట్లాడుతూ.. రాష్ట్ర సాఫ్ట్బాల్ అకాడమీ సుద్దపల్లిలో విజయవంతంగా కొనసాగుతుందనడానికి ఇప్పటివరకు భారత జట్టులో 15 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించడం గర్వకారణమన్నారు. భవిష్యత్తులో మరింత మంది క్రీడాకారులను భారత జట్టుకు అందిస్తామని ఆవిధంగా తామంతా కృషి చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మర్కంటి గంగా మోహన్, సాంఘిక సంక్షేమ డిగ్రీ ఆర్మూర్ కళాశాల ప్రిన్సిపల్ ధనవేని, జిల్లా స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ పి నీరజ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్స్ దీప్తివాని, వనిత, ఉపాధ్యాయులు సుకన్య, కృష్ణవేణి, గీత, సుమలత, జ్యోతి, సంజీవ, వ్యాయామ ఉపాధ్యాయులు నల్లూరి లత, మమత, స్వప్న, సాఫ్ట్బాల్ అకాడమీ కోచ్‌లు మౌనిక, నరేష్ పాల్గొన్నారు.

## ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలవాలి

**నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ**

వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో నిజామాబాద్ పార్లమెంటు లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో బిజెపి అభ్యర్థులే గెలవాలనే దానిపైన కేంద్రమంత్రి అమిత్‌షాతో ఢిల్లీలో నిజామాబాద్ పార్లమెంటు ఎంపీ ధర్మపురి అరవింద్ సోమవారం చర్చించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో గెలుపొందడానికి ఎటువంటి చర్యలు, వ్యూహాత్మకమైన పనులు నిర్వహించాలనే అంశాలపై చర్చించడం జరిగిందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు.



అమిత్‌షాతో మాట్లాడుతున్న ఎంపీ

# ఆచార్య దేవోభవ

- వెలుగు చూపేది గురువు
- నేడు ఉపాధ్యాయ దినోత్సవం

**నవతెలంగాణ-ఆర్మూర్**

**దేశాన్ని ఏలే నాయకుడు.. సరిహద్దులోని సైనికుడు ...పునాది నిర్మించే ఇంజనీరు. ప్రాణం పోసే వైద్యుడు. ఆవిష్కరణలు చేసే శాస్త్రవేత్త. ఇలా ఎందరికో ఆఆఇ ఈ లు దిద్దించి విద్యాబుద్ధులు నేర్పి సమాజంలో విజ్ఞాన జ్యోతిని వెలిగించే దీపాలు ఉపాధ్యాయులే. క్షిపణి రంగంలో దేశాన్ని ఉన్నత స్థానంలో నిలబెట్టిన అబ్దుల్ కలాంను ఆ స్థాయికి చేర్చింది ఒక గురువే. నేడు టీచర్స్‌డే సందర్భంగా నవ తెలంగాణ ప్రత్యేక కథనం..**



### తమ జీవితాలను త్యాగం చేసి....

ఈ ప్రపంచంలో ఎన్ని వందల వృత్తులున్న వారందరిని తయారు చేసేది ఉపాధ్యాయ వృత్తి.. అందుకే ఆ వృత్తి అంటే నాకు ఎంతో గౌరవం అని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఎంత ఎత్తుకు ఎదిగిన ఉపాధ్యాయ వృత్తిని మరువలేదు. చీమను చూసి క్రమశిక్షణ నేర్చుకో ..భూమిని చూసి ఓర్పును నేర్చుకో.. చెట్టును చూసి ఎదుగుదలను నేర్చుకో ..ఉపాధ్యాయుడిని చూసి సుగుణాలు నేర్చుకో అన్నారు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్. తల్లి, తండ్రి తర్వాత గురువే దైవం. సమాజం మనకు ఎంతోమంది ఉపాధ్యాయులు తమ జీవితాలను త్యాగం చేసి భావిభారత పౌరులను తయారు చేస్తున్నారు..

### పుట్టిన రోజుకు బదులు ఉపాధ్యాయ దినోత్సవంగా...

1962 సంవత్సరం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారత రాష్ట్రపతి అయ్యాక కొందరు మిత్రులు శిష్యులు పుట్టినరోజు జరపటానికి ఆయన వద్దకు వచ్చినప్పుడు నా పుట్టినరోజును నేరుగా జరిపే బదులు ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహిస్తే నేను ఎంతో గర్విస్తాను అని చెప్పి ఉపాధ్యాయ వృత్తి పట్ల తన ప్రేమను చాటారు. ఉపాధ్యాయునిగా ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి.. విషయం తెలుసుకున్న విద్యార్థులు గుర్రపు బుగ్గీని పూలతో అలంకరించి దానిపై రాధాకృష్ణను కూర్చోబెట్టి విద్యార్థులు లాక్కుంటూ ఆయనకు బదిలీ అయినా పాఠశాల వరకు తీసుకెళ్లి తన గురుభక్తిని చాటుకున్నారు. అప్పటి నుంచి ఆయన పుట్టిన రోజును భారతదేశంలో ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నారు.

### విద్యార్థుల మనసు దోచుకోవాలి

ఇతరులు ఎలా ఉండాలని కోరుకుంటున్నాము.. మనము అలాగే ఉండాలని చెప్పినట్లు ఉపాధ్యాయులు ఆచరించి చూపించాలి. విద్యార్థుల మనసు దోచుకొన స్థితిలో ఉపాధ్యాయుల ప్రవర్తన ఉండాలి. తరగతి గదిలో బోధన పటిమ బయట గౌరమైన జీవితం కలిగి ఉండాలి. వృత్తి ప్రధానంగా సమయపాలన, ఖచ్చితత్వం, చిత్తశుద్ధి అనేవి గురువుకు ఉండాల్సిన లక్షణాలు.



**లక్కారం రాజేంద్ర ప్రసాద్**
**నలంద పాఠశాల కరస్పాండెంట్ మామిడిపల్లి**

### రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా....

జిల్లాలోని ఇద్దరు ఉపాధ్యాయులు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక య్యారు.. నేడు ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని హైదరాబాదులో జరిగే కార్యక్రమంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా వీరు అవార్డులు తీసుకోనున్నారు.. బాల్కొండ ప్రభుత్వం ఉన్నత పాఠశాల సాంఘిక శాస్త్రం బోధించి ఉపాధ్యాయులు వేల్పూర్ శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ మండలంలోని గుండారం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కాసర్ల నరేష్ రావు ఎంపికయ్యారు. నూతన ఆలూరు మండల కేంద్రానికి చెందిన వేల్పూర్ శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కావడం పట్ల ఆర్మూర్,, ఆలూర్ ,బాల్కొండ మండలాల ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేశారు.

### ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన సర్వేపల్లి

ఉపాధ్యాయ వృత్తికి వన్నెతెచ్చిన ఘనులు సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశ తొలి రాష్ట్రపతిగా ఎంపికై అందరికీ ఆదర్శ ప్రియమై నేడు ఆ మహనీయుని పుట్టినరోజున గురుపూజోత్సవం జరుపు కోవడం ఎంతో సంతోషకరం. ఆయన అమరజీవిగా ప్రతి ఉపాధ్యాయుడిలోనూ జీవించి ఉన్నారు.



**గుజరాతి ప్రకాష్, జెంటిల్ కిడ్స్ ప్లే స్కూల్ కరస్పాండెంట్, ఆర్మూర్**

### ఉపాధ్యాయ దినోత్సవం

ఉపాధ్యాయుడు
నేనో గుప్త నిధికి కాపలాదారుణ్ణి,
నిధి రహస్యాలన్నీ
నిర్భయంగా ఛేదించే
పరిశోధకుణ్ణి,
పరిశోధనా పరిజ్ఞానాన్ని
పంచి పెట్టాలనే తహ తహ కలిగిన తాపసిని,
నేనో గుప్త నిధికి కాపలాదారుణ్ణి
నా శిష్యుల అంతరంగాన్ని
అద్దంగా మార్చి , అలవోకగా
ఆనందపరిచే ఆటగాణ్ణి,
సరికొత్త విధానాలతో సమాధాన పరచగల
సలహాదారుణ్ణి,
మౌనాన్ని మాయజేసే
మాటల మాంత్రికుణ్ణి,
ప్రశ్నించే ధైర్యం ప్రజ్ఞా పాటవాలతో అందించే
పాదరసాన్ని,
నేనో గుప్త నిధికి కాపలాదారుణ్ణి
వివేకాన్ని,విషయ సేకరణతో
వివరించగల విజ్ఞుణ్ణి,
విద్య వినయాన్ని, విచక్షణా జ్ఞానాన్ని నేర్పుతుందనే
నమ్మకాన్ని కలిగించే విద్యావంతుణ్ణి,
నేనో గుప్త నిధికి కాపలాదారుణ్ణి.
అద్భుత దీపంతో అజ్ఞానాంధకారాన్ని తొలగించే
అల్లావుద్దీణ్ణి,
నవ్వుతూ, నవ్విస్తూ సానుకూల దృక్పథాన్ని పెంచే
నటనా విదూషకుణ్ణి,
ప్రేమను పంచుతూ ప్రేమలోని
మాధుర్యాన్ని తెలిపే ప్రేమికుణ్ణి.
కలలు కనడం నేర్పించి ఆ కలలను సాకారం చేసుకునే
ఉపాయాన్ని చెప్పే కవిని.
భయాన్ని పోగొట్టి భద్రతను పొందే మార్గాన్ని
చూపే బాహుబలిని.
ఆలోచనా తీరు పలురకాలని
ఆలోచింపజేసే తీరును తెలిపే ఆచార్యుణ్ణి.
**పొట్లూరి శారద-టీచర్**

### జిల్లా స్థాయికి...

జిల్లాలోని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఈ సంవత్సరం 30 మంది ఎంపిక కాగా ఇందులో ఆర్మూర్ పట్టణంకు మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఆరుగురు ఎంపిక కావడం విశేషం.

## గాంధీభవన్‌లో ముఖ్య నాయకుల సమావేశం

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

గాంధీభవన్‌లో నిజామాబాద్ పార్లమెంటు ముఖ్య నాయకుల సమావేశం సోమవారం నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి కర్ణాటక ఎమ్మెల్యే బిఎం నాగారాజు పర్యవేక్షకునిగా హాజరయ్యారు. నిజామాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని పిసిసి మెంబర్లు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, అనుభంగా విభాగాల జిల్లా అధ్యక్షులతో పాటు నియోజకవర్గంలో పోటీచేసిన అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బి ఎం నాగరాజు మాట్లాడుతూ రాబోయే అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో పార్లమెంట్ పరిధిలోని 7 అసెంబ్లీ నియోజకవర్గాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించే దిశగా నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్లాలని దిశ నిర్దేశం చేశారు.ఈ నెల 12,13,14 తేదీలలో నియోజకవర్గ స్థాయి సమావేశాలు ఏర్పాటుచేయడం జరుగుతుందని ఆయన సూచించారు. కార్యక్రమంలో పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మాజీ ప్రభుత్వ విప్ ఈరవత్రి అనిల్, పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్ బిన్ హందాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, రూరల్ ఇంచార్జి భూపతి రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఆరికెల నర్సారెడ్డి, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు అన్వేష్ రెడ్డి,నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు, పిసిసి అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న జిల్లా ముఖ్య నాయకులు

## వర్షాల వల్ల ఆస్తి, ప్రాణ నష్టం జరిగితే సమాచారం అందజేయాలి

**నవతెలంగాణ-డిచ్‌పల్లి**

డిచ్ పల్లి, ఇందల్ వాయి మండలాల పరిధిలోని అన్ని గ్రామాలకు చెందిన సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు రానున్న రెండు మూడు రోజుల్లో అతి భారీ వర్షాలు ఉండటం వల్ల తప్పనిసరిగా హెడ్ క్వార్టర్ మెయింటెన్ చేయాలని ఎంపిడిఓ టీవీఎస్ గోపి బాబు, రాములు నాయక్ సోమవారం తెలిపారు.

అన్ని గ్రామాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, గ్రామంలో టామ్ మైక్ ద్వారా ప్రజలకు తెలపాలని అన్నారు. ఎక్కడైనా వర్షాల వల్ల ఆస్తి నష్టం, ప్రాణ నష్టం జరిగితే తప్పనిసరిగా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందజేయాలని ఆదేశించారు. మత్స్యకారులు, మేకల, గొర్ల కాపరులు, ప్రజలు చెరువులు, కుంటలు ప్రాజెక్టుల వద్దకు వెళ్ళవద్దని విజ్ఞప్తి చేశారు.

## నిత్యావసరాల ధరలు తగ్గించాలి :సీపీఎం



నిరసన తెలుపుతున్న నాయకులు, కార్యకర్తలు

**నవతెలంగాణ-నిజామాబాద్**

నిత్యావసరాల ధరలు తగ్గించాలని సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్ఆర్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర కార్యవర్గ సభ్యురాలు సుజాత మాట్లాడుతూ నిత్యవసర ధరలు రోజురోజుకు పెరుగుతున్న మధ్య తరగతి ప్రజల వేతనాలు కానీ కూలీలు కానీ ఎక్కడ పెరిగిన పాపన పోలేదన్నారు. చేతినిండా పని లేక తినడానికి తిండి లేక సామాన్య ప్రజలు, మధ్యతరగతి ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ధరలు ఎట్లయితే పెంచుకున్నారో అలాగే రోజువారి కూలీలు మధ్యతరగతి కుటుంబాల వేతనాలు పెంచాలని అన్నారు. కనీసం మూడు పూటలు తిండి తినే విధంగా ప్రజలకు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో నగర కమిటీ సభ్యులు మునీర్ అహ్మద్, నగర నాయకులు డి కృష్ణ. నాయకులు రజియా, భాస్కర్, రఘు, రేష్మ, సల్మా రుక్మిణి, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య అందించడం.. హాజరుశాతం పెంచడం

- అంకితభావంతో విద్యాబోధన
- జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలుగా ఎంపికైన మాడవేడి పద్మావతి

**నవతెలంగాణ-ఆర్మూర్**

20 ఏళ్లగా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ వృత్తినే దైవంగా భావిస్తు అంకిత భావంతో పని చేస్తూ విద్యార్థుల అభివృద్ధికి కృషి చేస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు మాడవేడి పద్మావతి. పని చేసిన ప్రతి చోట విద్యార్థుల హాజరు శాతం పెంచుతూ నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రస్తుతం ప్రాథమిక పాఠశాల గోవిందపేట్ (వి) మండలంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులుగా సేవలు అందిస్తున్నారు మాడవేడి పద్మావతి. బోధన, బోధనేతర కార్యక్రమాలు నిర్వహిస్తు విద్యార్థులలో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నైతిక విలువలు పెంపొదిస్తూ భావి భారత పౌరులుగా తీర్చి దిద్దుతున్నారు. పాఠశాల పేరు మీద యూ ట్యూబ్ ఛానల్‌ను కూడా ప్రారంభించి పాఠాలు బోధిస్తూ పాఠశాలలో జరిగే సాంస్కృతిక కార్యక్రమాలను పొందుపరచడం వల్ల అనేకులు వాటిని వీక్షిస్తూ అభినందనలు తెలియజేయడం గమ నార్హం. ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేయుటకు స్వచ్ఛంద సంస్థలు, దాతల సహకారంతో పాటు సొంత ఖర్చులతో విద్యార్థులకు అన్ని రకాల సదుపాయలు కల్పిస్తూ గ్రామ స్థాయిలో మంచి పేరు సంపాదించి పలువురి ప్రశంసలు పొందారు. సర్పంచ్ జమున గంగాధర్, ఎంపీటీసీ యాల్లా రాజకుమార్, సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్, విడిసి అధ్యక్షులు లింగన్న సభ్యులు, గ్రామ ప్రజా ప్రతినిధులు, పాఠశాల చైర్మన్ సయ్యద్ అంజాద్, విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయ బృందల్ల సహాయ సహకారంతో మండలం లోనే మంచి పేరు సంపాదించుకున్నారు. దశాబ్ది ఉత్సవాలు 2023 మహిళా సమాఖ్యలో భాగంగా ఆశన్నగారి జీవన్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. మండల విద్యాశాఖాధికారి రాజా గంగారాం ప్రతి విషయంలో ప్రోత్సహిస్తూ అభినందించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సీతయ్య సలహాలు సూచనలు ఇస్తూ ప్రోత్సాహం అందించారు. మాడవేడి పద్మావతి ఉద్యోగరిత్యా అహర్నిశలు శ్రమిస్తూ ఈ జిల్లా స్థాయి అవార్డు అందుకోవడం ప్రశంసనీయం. ఈ సందర్భంగా పలువురు అభినందించారు.



# పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి

- డిఈఓకి వినతి
- 13న చలో విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం జయప్రదం చేయండి
- తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు)

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఈనెల 13న చలో విద్యాశాఖ కమిషనర్ కార్యాలయాన్ని జయప్రదం చేయాలని తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ పిలుపునిచ్చారు. తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ మాట్లాడుతూ.. సిఐటియు పోరాట ఫలితంగా ఒకటి నుండి 8వ తరగతి వరకు జూలై నెల వరకు బిల్లులు విడుదల అయ్యాయని అన్నారు. 9, 10 తరగతు లకు సంబంధించి గుడ్ల బిల్లులు మెస్ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, పెండింగ్ లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి జూలై నెల నుండి 3000 రూపాయల గౌరవ వేతనాన్ని ఇస్తామని చెప్పినప్పటికీ అందుకు అనుగుణంగా బడ్జెట్ విడుదల చేయలేదని అన్నారు. కొత్త మెనూ అమలు కోసం, రాగి జావా వండి పెట్టాలని అధికారులు ఒత్తిడి తీసుకురావడం సమంజసం కాదని తెలిపారు. ఈ విషయంలో జిల్లా అధికారులకు సైతం ఎటువంటి స్పష్టత లేకపోయినా, కొత్త మెనూ అమలు చేయాలని ఒత్తిడి తీసుకురావడం ఎంతవరకు సమంజసమని అన్నారు. పెండింగ్ బిల్లుల సాధన కోసం, 3000 రూపాయల గౌరవ వేతనం, ఏరియర్స్‌తో సహా ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈనెల 13న చలో విద్యాశాఖ రాష్ట్ర కమిషనర్, కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమానికి జిల్లాలోని మధ్యాహ్న భోజన కార్మికులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నగర కోకన్వీనర్ ధ్యారంగుల కృష్ణ, మధ్యాహ్న భోజన యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొండగంగాధర్, నాయకులు సురేందర్ రెడ్డి, నాగమని, భూలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

## వర్షానికి కూలిన ఇల్లు పరిశీలించిన అధికారులు

నవతెలంగాణ-దోమకొండ



మండల కేంద్రంలో రాత్రి కురిసిన వర్షానికి చింతల శ్రీనివాస్ అనే వ్యక్తి ఇల్లు కూలిపోవడంతో జడ్పీటీసీ తీగల తిరుమలగౌడ్, తహసీల్దార్ సంజయ్‌రావు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సంజయ్ రావు మాట్లాడుతూ.. మండలంలోని ఆయా గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇండ్లల్లో ప్రజలు ఉండవద్దని, వర్షంతో ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే అధికారులకు సమాచారం అందించాలని, కోరారు. వర్షానికి కూలిన ఇండ్ల లిస్టును తయారుచేసి ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తీర్మాల్‌గౌడ్, ఆర్ఐ మహేందర్‌రెడ్డి ఉన్నారు.

## చిరుత దాడిలో రెండు గొర్రెలు మృత్యువాత

నవతెలంగాణ-పిట్లం



మండలంలోని అల్లాపూర్ గ్రామానికి చెందిన అంజుగొండ గొర్రెల మందపై చిరుత పులి దాడి చేయడంతో రెండు గొర్రెలు మృత్యువాత పడినట్టు బాధితుడు తెలిపారు. బాధితుడి వివరాల ప్రకారం.. రోజు మాదిరి ఆదివారం తమ గొర్రెల మందను మేత కోసం అడవికి ప్రాంతానికి తీసుకెళ్లగా సాయంత్రం వేళలో రెండు గొర్రెలపై చిరుత పులి దాడి చేయగా.. అంజుగొండ కేకలు వేయడంతో సమీపంలోని చుట్టుపక్కల వారు రావడంతో చిరుతపులి గొర్రెలను వదిలి పారిపోయింది. ఈ ప్రమాదంలో అప్పటికే రెండు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.15వేల వరకు నష్టం వాటిల్లింది.

# ఇష్టానుసారంగా కల్లు దుకాణాల ఏర్పాటు

### నిబంధనలు గాలికి.. పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు

**నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాలకు, రహదారులకు, చెరువులకు, కుంటలకు, పాఠశాలలకు దూరంగా ఉండాల్సిన కల్లు దుకాణాలను నిబంధనలు గాలికి వదిలేసి యథేచ్ఛగా గ్రామ నడిబొడ్డునే ఏర్పాటు చేస్తున్నారు నిర్వాహకులు. దీంతో ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయినా ఎక్సైజ్ శాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.**

నవతెలంగాణ-నసురుల్లాబాద్



నసురుల్లాబాద్ మండలం దుర్కిలో రోడ్డు పక్కనే కల్లుతాగుతున్న పలువురు

కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల పరిధిలో రహదారి పక్కన, ఆలయాల పక్కన, ప్రాథమిక పాఠశాలల పక్కనే కల్లు దుకాణాలు వెలుస్తున్నాయి. నసురుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామంలో బాన్సువాడ రహదారి నుంచి దుర్కి, మిర్జాపూర్ గ్రామాలకు వెళ్లే రహదారి పక్కనే కల్లు దుకాణం ఉండడంతో కల్లు తాగిన వారు అల్లరి చెయ్యడం, రోడ్డుపైనే కల్లు సీసాలు వేయడం, కల్లు తాగి కేరింతలు వేయడంతో రోడ్డుపై వెళ్లే మహిళలు, విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఎక్సైజ్ అధికారులు అవేమీ చూడకుండా అనుమతి ఇవ్వడంతో కల్లు దుకాణాలను యథేచ్ఛగా సాగుతున్నాయి. పాఠశాలకు విద్యాబుద్ధులు నేర్చుకోవడానికి వచ్చే విద్యార్థులకు రోడ్డు పక్కనే గల కల్లు దుకాణంలో కల్లు సేవించే వారి హావభావాలు, మాటలు, తిట్లు విని వారిని అనుసరించి చెడిపోతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఇక్కడ కల్లు తాగిన వారు పడవేసే ప్లాస్టిక్ కవర్లు, గాలికి పాఠశాలలోకి కొట్టుకు వస్తున్నాయని ఉపాధ్యాయులు, విద్యార్థులు పేర్కొంటున్నారు. ఈ విషయ మై పలుమార్లు కల్లు దుకాణం యజమానులకు వివరించినా పట్టించుకునే వారే కరువయ్యారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే మండలంలోని కంశెట్‌పల్లి, చెరువు కట్టపైన చెట్టు కల్లు దుకాణంలో కల్లు తాగిన వారు మత్తులో రోడ్డుపై నుంచి వెళ్లే వాహనదారులకు ఇబ్బందులు కలిగిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు.

పలు మార్లు ఈ కల్లు దుకాణం వద్ద చిన్నపాటి ప్రమాదాలు సైతం జరిగిన ఘటనలు ఉన్నాయి. ఏదైనా భారీ రోడ్డు ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తే బాధ్యులు ఎవరని వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహ రిస్తుండడంతో కల్లు దుకాణం వాహనదారుల పాలిట శాపం గా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కల్లు దుకాణాల పక్కనే రహదారి ఉండడంతో కల్లు ప్రియులు ప్రమాదవశాత్తు అందులో పడి మరణిస్తే బాధ్యులెవరని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-తాడ్వాయి

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నిజాంసాగర్ ప్రాజెక్ట్ నాలుగు గేట్లు ఎత్తి 20 వేల క్యూసెక్కుల నీటిని కిందికి వదిలామని, నదీపరివాహక ప్రాంత గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సోమవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. అత్యవసరమైతే తప్పా రాత్రిపూట చీకట్లో ఎవ్వరూ బయట తిరగవద్దని అన్నారు. నది దిగువ పరివాహక ప్రాంతం సమీపంలో ఉన్న పశువులను ఎత్తు ప్రదేశాలకు తరలించాలని సూచించారు. అదేవిధంగా నది పరివాహక లోతట్టు ప్రాంతాలకు చేపలు పట్టే వారు, పశువుల కాపరులు, రైతులు, ప్రజలెవరూ వెళ్లవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## అన్న బాహుసాటే ఆశయ సాధనకు కృషి చేద్దాం

- సర్పంచ్ అరుణ్ కుమార్



జెండావిష్కరిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బిచ్కుంద

సాహిత్య సామ్రాట్ అన్నా బహు సాటే ఆశయ సాధనకు సమిష్టిగా అందరం కృషి చేద్దామని ఫథలాపూర్ సర్పంచ్ అరుణ్ కుమార్ అన్నారు. సోమవారం బిచ్కుంద మండలంలోని ఫథలాపూర్ గ్రామంలో అన్న బాహుసాటే యువజన సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం సర్పంచ్ అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. అన్న బాహుసాటే బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతకి నిరంతరం కృషి చేసిన మహనీయుడని, ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాగ్నాథ్ పటేల్, సొసైటీ వైస్ చైర్మన్ యాదవ్‌రావు, ఉపసర్పంచ్ శివకాంత్, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు సిద్ధప్ప పటేల్, అన్న బహుసాటే సంఘం అధ్యక్షులు, సభ్యులు, యువజన సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రామేశ్వర ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-పిట్లం

మండల కేంద్రంలోని రామేశ్వర ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షులు పుండరీకం షెట్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ.. శ్రావణ సోమవారం సందర్భంగా ఆలయంలో అభిషేకం నిర్వహించి భక్తాదుల నిమిత్తం మహా అన్నదానం కార్యక్రమానికి దాతలు చంద్రశేఖర్, ఉప్పు ప్రేమ్‌కుమార్, పద్మ వేణు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో శివ భక్తులు పాల్గొన్నారు.

## రత్నగిరిపల్లిలో సంపూర్ణ మధ్య నిషేధం

- అమలు కోసం ఏకగ్రీవ తీర్మానం

నవతెలంగాణ-మాచారెడ్డి

మద్యాన్ని విక్రయించడంతో యువత తప్పుదారి పడుతుందని గ్రామస్తులు భావించారు. దీంతో సరైన మార్గంలో యువత పయణించేందుకు.. గ్రామంలో సంపూర్ణ మద్య నిషేధం అమలు చేయాలని నిర్ణయం తీసుకుని ఆదర్శంగా నిలుస్తున్నారు. మండలంలోని రత్నగిరిపల్లి గ్రామంలో గ్రామపెద్దలు, ప్రజాప్రతినిధుల సమక్షంలో సమావేశం నిర్వహించి మద్యం విక్రయించద్దని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎవరైనా గ్రామంలో మద్యం విక్రయిస్తే రూ.పదివేలు జరిమానా విధిస్తామని సమిష్టిగా నిర్ణయం తీసుకున్నారు.

## భక్తులతో కిటకిటలాడిన దక్షిణ కాశీ

నవతెలంగాణ-భిక్కనూర్

శ్రావణ సోమవారం సందర్భంగా మండల కేంద్రంలోని దక్షిణ కాశి శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అలాగే ఆలయ ప్రాంగణంలో సత్యనారాయణ స్వామి వ్రతాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం శ్రావణ మాసం సందర్భంగా ఆలయ అధికారులు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం వసతి ఏర్పాటు, అన్ని సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ ఈవో శ్రీధర్ తెలిపారు.

## ఆలయాభివృద్ధికి భక్తుల విరాళం



విరాళం అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని దక్షిణ కాశీ శ్రీ సిద్ధ రామేశ్వర ఆలయ అభివృద్ధికి మెదక్ జిల్లా రామయంపేట్ పట్టణానికి చెందిన నివాస్ కుటుంబ సభ్యులు రూ.10,116 విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి విరాళం అందజేసిన భక్తులను శాలువాతో సత్కరించి స్వామి వారి ప్రతిమను, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో శ్రీధర్, అర్చకులు సిద్ధగిరి శర్మ, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నవతెలంగాణ-మాచారెడ్డి

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1995-1996 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థులు 27 సంవత్సరాల తర్వాత సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు వారి వారి కుటుంబాల స్థితిగతులను తెలుసుకొని స్నేహితులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులను పిలిపించుకుని వారికి ఘనంగా సన్మానించారు.

## కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ




చెక్కులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ ఎంఎస్ రమేష్ కుమార్ రెంజల్ గ్రామానికి చెందిన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. రెంజల్ గ్రామానికి చెందిన 15 మందికి చెక్కులు రావడంతో వారికి పంపిణీ చేసినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ నిరుపేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఈ చెక్కులను పంపిణీ చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షులు టి.అంజయ్య, అగ్గు నారాయణ, సాయగౌడ్, అనిల్, మంగలి నారాయణ, షబ్బీర్, గంగాధర్, లక్ష్మి, రాములు, ఉస్మాన్, సలీం తదితరులు పాల్గొన్నారు.

## వరి పంట క్షేత్రస్థాయిలో పరిశీలన



పంటను పరిశీలిస్తున్న అధికారిణి కవిత

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని దూపల్లి, కళ్యాపూర్ గ్రామాలలో క్షేత్రస్థాయిలో వరి పంటను పరిశీలించినట్టు మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారిని కవిత పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితుల వల్ల వరి పంటకు కాండము తొలుచు పురుగు, ఆకు ముడత, ఎండు ఆకు తెగులు, సోకిందని వీటి నివారణకు సస్యరక్షణ మందులను వాడాలని ఆమె సూచించారు. ఆమె వెంట రైతు శ్రీనివాస్, పల్ల బాబు, పఠాన్ రవి, గోగు దినేష్ తదితరులు పాల్గొన్నారు.

# యువతా.. కదలండి..

### ఓటర్‌గా నమోదు చేసుకోండి

**ఓ వైపు రాజకీయ పార్టీలు ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టగా.. మరోవైపు అధికార యంత్రాంగం ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేస్తోంది. ఇంకోవైపు ఎన్నికల సంఘం తుది ఓటర్ల జాబితా ప్రకటించేందుకు చర్యలు చేపట్టింది. 1 అక్టోబరు 2023 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరు నమోదు చేసుకోవడానికి అర్హులని తేల్చింది.**




ఓటరు నమోదు అవగాహన కోసం ఏర్పాటు చేసిన ప్రచార రథం

నవతెలంగాణ-నసురుల్లాబాద్

బాన్సువాడ నియోజకవర్గంలో మొత్తం 258 పోలింగ్ కేంద్రాలున్నాయి. అందులో నసురుల్లాబాద్ మండలంలో 26, బీర్కూర్ మండలంలో 24, బాన్సువాడ మండలంలో 66 పోలింగ్ కేంద్రాలతో పాటు మరికొన్ని మండలాల్లో మరిన్ని పోలింగ్ కేంద్రాలున్నాయి. ఈ పోలింగ్ కేంద్రాలతోపాటు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో, ఎన్నికల అధికారులు దరఖాస్తు ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చు. ఆన్‌లైన్, మీసేవా ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. అర్హులైన వారందరినీ ఓటరు జాబితాలో నమోదు చేయించడానికి అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం చేస్తోంది. ఇందులో భాగంగా సోమవారం నసురుల్లాబాద్ మండల కేంద్రంలో వాహనాలతో ప్రచారం నిర్వహిస్తున్నారు. శని, ఆదివారాల్లో అన్ని పోలింగ్ స్టేషన్లలో ప్రత్యేక ఓటరు జాబితా నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నారని తహసీల్దార్లు తెలిపారు. ఆయా గ్రామపంచాయతీ భవనాల్లో ఓటరు జాబితాను ప్రదర్శిస్తారు.

ఇందులో పేర్లు లేకుండా అక్కడే ఫారం-6 అందిస్తే చాలు ఓటరు జాబితాలో పేరు నమోదు చేస్తారు. పేర్ల తొలగింపు, పోలింగ్ కేంద్రాలు మార్పులు, చేర్పులు దరఖాస్తులు స్వీకరిస్తారు. అభ్యంతరాలను అక్కడి కక్కడే పరిష్కరిస్తారు. తర్వాత పోలింగ్ కేంద్రాలకు నియమితులైన బీఎల్‌వోలు (బూత్ లెవల్ అధికారి) ఇంటింటికీ వెళ్లనున్నారు. ప్రతి ఒక్కరినీ పలుకరించి, అర్హులైన వారుంటే అక్కడికక్కడే ఓటరు జాబితాలో పేరు నమోదు చేస్తారు. ఓటర్లు చనిపోతే వారి పేర్లు తొలగించడం, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతే నోటీసులు అందించి వారి పేర్లు తొలగిస్తూ బదిలీ ప్రక్రియను చేపట్టనున్నారు. 1 అక్టోబరు 2023న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. బీఎల్‌ఓలతో ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ నమోదు కార్యక్రమం కొనసాగుతుందని రెవెన్యూ అధికారులు తెలిపారు.

# 10 నుంచి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ మేళా

నవతెలంగాణ-బోధన్

బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ ఆధ్వర్యంలో యువతీ యువకులకు ఈ నెల 10వ తేదీ నుంచి ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ అందించే కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున 18 సంవత్సరాల నుంచి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు ఈ మెగా డ్రైవింగ్ లైసెన్స్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే షకీల్ ఆమేర్ వ్యక్తిగత సహాయకులు అఖిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బోధన్ పట్టణం, బోధన్, సాలూర, రెంజల్, ఎడపల్లి మండల ప్రజలు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఈ నెల 10 నుంచి 25 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. నవీపేట్ మండల ప్రజలకు బోధన్ పట్టణం దూరభారం కావడం వలన వారికి నవీపేట్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, విరాట్ కాంప్లెక్స్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉదయం 10.30 నుంచి 4 గంటల వరకు దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. ఆధార్ కార్డ్, వయస్సు నిర్ధారణ కోసం 10వ తరగతి సర్టిఫికెట్ లేదా బోనఫైడ్ సర్టిఫికెట్ లేదా సెల్ఫ్ డిక్లరేషన్ నోటరీ, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకొని రావాలని, మరిన్ని వివరాలకు ఫోన్ 9676228008 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. నవీపేట్ మండలం వారు 9949204273 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# అభివృద్ధి చేయడంలో ఆదర్శం..

- ఘనంగా జడ్పీ వైస్ చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఎడపల్లి

జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు, ఎడపల్లి మండల జెడ్పీటీసీ మానికొల్ల రజితా ఎల్లయ్య యాదవ్ జన్మదిన వేడుకలను ఎడపల్లి మండల ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, యువకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు రజితా ఎల్లయ్య యాదవ్ దంపతులను కలిసి పూల బోకెను అందజేసి గజమాల, శాలువాలతో సన్మానించారు. మహిళ ప్రజాప్రతినిధిగా ఆమె మండలానికి అందిస్తున్న సేవలు గొప్పవని ఎడపల్లి సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్, తానాకలన్ సర్పంచ్ పాల్దా భాస్కర్‌రెడ్డి, కొనియాడారు. గతంలో ఐదేండ్లపాటు ఎడపల్లి ఎంపీపీగా పనిచేసి గ్రామాల అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని, ప్రస్తుతం ఆమె జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలుగా పనిచేస్తూ ఎడపల్లి మండలాన్నే జిల్లాల్లోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దుతున్నారని వివరించారు.

బోధన్ నియోజకవర్గ శాసనస భ్యులు మహమ్మద్ షకీల్ అమీర్, ఆయన సతీమణి ఫాతిమా అయోషా బేగం సహకారంతో ఎడపల్లి మండలంలోని అన్ని గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమాలకు రజిత ఎల్లయ్య యాదవ్ శ్రీకారం చుట్టారని నాయకులు కొనియాడారు. అనంతరం ఎల్లయ్య యాదవ్ దంపతులకు ప్రజాప్రతినిధులు, నాయకులు, స్నేహితులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జైతాపూర్ సహకార సంఘం అధ్యక్షులు కరటూరి సత్యనారాయణ, తానాకలాన్ సర్పంచ్ పాల్ద భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సూర్యకాంత్ వాగ్మారే, సలీం పాషా తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
మంగళవారం | సెప్టెంబర్ 05, 2023 | www.navatelangana.com



## ఆలూరులో ఎమ్మెల్యేకు సన్మానం

నవతెలంగాణ-ఆర్మూర్


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న నాయకులు

ముఖ్యమంత్రి కెసిఆర్ ఇటీవల వికలాంగులకు పింఛన్ 4016 రూపాయలు పెంచి మరింత ప్రోత్సహించినందున ఆలూర్ మండల కేంద్రంలో గుండేడి పురుషోత్తం అధ్వర్యంలో సోమవారం టపాకాయలు కాల్చి ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ని సన్మానించి వారి సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు ఆలూరు శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ కళ్లెం మోహన్ రెడ్డి, ఎంపీటీసీ మర్కంటి మల్లేష్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నియోజకవర్గ పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శికి సన్మానం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

బాల్కొండ నియోజకవర్గం పద్మశాలి సంఘం ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన మండలంలోని ఉప్లూర్ గ్రామానికి చెందిన పోతు ధరణి కుమార్‌ను సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలోని ఓం మార్కండేయ పద్మశాలి సంఘం సభ్యులు ధరణి కుమార్‌ను సంఘ భవనంలో శాలువాతో సత్కరించి, అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని సంఘ సభ్యులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బద్దం చిన్నారెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్, ఎంపీటీసీ సభ్యుడు అనిల్, బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆవారి మురళి, నాయకులు అవారి గంగారెడ్డి, నందగిరి శ్రీధర్, ఓం మార్కండేయ పద్మశాలి సంఘం అధ్యక్షులు పోతు లింగమూర్తి, ఉపాధ్యక్షులు సాంబార్ అశోక్, ప్రధాన కార్యదర్శి పోతు గణేష్, కోశాధికారి శ్రీమల్ల దేవన్న, సంఘ సభ్యులు పోతు నాగరాజు, పోతు దామోదర్, పోతు మురళి, గంగాధర్, భూమా గంగారం, తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలేదీక్షకు టీఎస్ యుటిఎఫ్ మద్దతు


మద్దతు తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ హెూల్డ్ కలెక్టరెట్ వద్ద జరుగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలకు సోమవారం టీఎస్‌యూటీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈసందర్భంగా రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు డి .సత్యానంద్ మాట్లాడుతూ... సమగ్ర శిక్ష ఉద్యోగులకు పని భారం ఎక్కువగా ఉందన్నారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి, వారి సమస్యలన్ని పరిష్కరించాలని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ. రమేష్ మాట్లాడుతూ సమస్య తీరే వరకు మీ వెంట యూటీఎఫ్ ఉంటుందని తెలిపారు. జిల్లా కార్యదర్శి వి.సాయన్న ఒక పాట - మాట తో ఉద్యోగులను ఉత్తేజ పరిచి మద్దతు ప్రకటించారు.

## పద్మశాలి సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సంఘ సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ ఓం మార్కండేయ పద్మశాలి సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి సోమవారం భూమి పూజ నిర్వహించారు. రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సంఘ భవనం నిర్మాణానికి రూ.6లక్షలు మంజూరు చేశారు. అట్టి నిధులతో చేపట్టనున్న సంఘ భవన నిర్మాణానికి సంఘ సభ్యుల సమక్షంలో భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బద్దం చిన్నారెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు, కమ్మర్ పల్లి ప్రాథమిక సహకార సంఘం అధ్యక్షులు రేగుంట దేవేందర్, గ్రామ బిఆర్ఎస్ అధ్యక్షులు అవారి మురళి, ఎంపీటీసీ సభ్యుడు పిప్పర అనిల్, ఉప సర్పంచ్ నందగిరి రేఖ శ్రీధర్, సంఘం అధ్యక్షులు పోతు లింగమూర్తి, ఉపాధ్యక్షులు సాంబార్ అశోక్, ప్రధాన కార్యదర్శి పోతు గణేష్, క్యాషియర్ శ్రీమల్ల దేవన్న, సంఘ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## అఖిల భారత యాదవ మహాసభ"ను విజయవంతం చేయండి

కరపత్రాలు ఆవిష్కరణ


మహాసభ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-ముప్కాల్

అఖిల భారత యాదవ మహాసభ 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ ఫంక్షన్ హాల్లో మంగళవారం "అఖిల భారత యాదవ మహాసభ" శతాబ్ది ఉత్సవాల కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా యాదవ సంఘం కోశాధికారి కట్ట మహేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం మండల కేంద్రంతో పాటు మండలంలోని వేంపల్లి, నాగంపేట్, నల్లూర్, రెంజర్ల, వెంచిర్యాల గ్రామాల్లో ఈ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ "అఖిల భారత యాదవ మహాసభ" కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా యాదవ సంఘం కోశాధికారి కట్ట మహేష్ యాదవ్, యాదవ సంఘం మండల అధ్యక్షులు ఏట్టెం మహేష్ యాదవ్, బాల్కొండ నియోజకవర్గ కన్వీనర్ శ్రీకాంత్ యాదవ్, వేంపల్లి, వెంచిర్యాల, రెంజర్ల, నల్లూరు, నాగంపేట్ యాదవ సంఘ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

## డ్రైనేజీలో చెత్త తొలగించిన సర్పంచ్, సిబ్బంది

నవతెలంగాణ-డిచ్‌పల్లి


డ్రయినేజీ శుభ్రం చేయిస్తున్న సర్పంచ్

ఇందల్వాయి మండలంలోని మల్లాపూర్ గ్రామంలో రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు డ్రైనేజీ లలో కూరుకు పోయిన చెత్తాచెదారం ను సర్పంచ్ లోలం సత్యనారాయణ తన వెంట కొందరు సిబ్బంది ని వెంట పెట్టుకుని వెళ్లి సోమవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు డ్రైనేజీ లలో వెళ్లకుండా రహదారుల పై నుండి వెళ్తుందని పలువురు తెలిపారు. వేంటనే డ్రైనేజీలలో కురుకు పోయిన చెత్తను తొలగించడంతో రాహదరులపై నీరు నిల్వ ఉండకుండా సాఫీగా వెళుతుందని సత్యనారాయణ తెలిపారు. భారీ వర్షం కురుస్తున్న సమయంలో సర్పంచ్ స్వయాన పనులు చేయడంతో పలువురు ఆయన చేస్తున్న పనులకు కృతజ్ఞతలు తెలుపుతున్నాను. ఒక పక్క వర్షం కురుస్తున్న పనులను స్వయాన చేపట్టడంతో పలువురు అభినందించారు. గ్రామంలో సమస్యలు లేకుండా చేయడమే ధ్యేయమని సర్పంచ్ లోలం సత్యనారాయణ నవతెలంగాణకు వివరించారు.

## అభివృద్ధి వైపే మాఓటు

- ఏకగ్రీవంగా తీర్మానం

నవతెలంగాణ-బాల్కొండ

మండలంలోని చిట్టాపూర్ గ్రామంలో గోపాలకృష్ణ కుర్మ సంఘ 41 కుటుంబాలు, మల్లన్న కుర్మ సంఘం 34 కుటుంబాలు మా ఓటు ప్రతి ఒక్కరం రానున్న సాధారణ ఎన్నికల్లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి ఓటు వేస్తామని సోమవారం ప్రమాణం చేస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మానం చేసిన కాపీని సర్పంచ్ వనజ గోవర్ధన్ గౌడ్ కు అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు గోవర్ధన్ మాట్లాడుతూ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ఎమ్మెల్యేగా గెలిస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందనే నమ్మకంతో ప్రతిపక్షాలు ఎన్ని ప్రకటనలు చేసిన వారి మాటలు నమ్మకుండా అభివృద్ధిని నమ్మి అభివృద్ధివైపు ఉంటామని తీర్మానం చేయడం చాలా సంతోషకరమని అన్నారు. తీర్మానం చేసిన సంఘం సభ్యులందరికీ చిట్టాపూర్ గ్రామం తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి


పోషణ్ అభియాన్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్, అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పెండింగ్ దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 41 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి తరలివచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, డీఆర్డీఓ చందర్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ప్రజావాణి అర్జీలకు ప్రాధాన్యతనిస్తూ వెంటదివెంట పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి వినతులపై తీసుకున్న చర్యల గురించి ఫిర్యాదుదారులకు తప్పనిసరిగా సమాచారం తెలియజేస్తూ, ప్రజావాణి సైట్ లో పూర్తి వివరాలు అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### పోషణ్ అభియాన్ పోస్టర్ల ఆవిష్కరణ

బాలింతలు, శిశువుల ఆరోగ్యం కోసం సమతుల పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ పోషణ్ అభియాన్ లో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన గోడప్రతులను కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆవిష్కరించారు. ఈ నెల 01 నుండి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న పోషణ్ అభియాన్ కార్యక్రమం సందర్భంగా పౌష్టిక, సమతుల ఆహారం తీసుకోవాల్సిన ఆవశ్యకత గురించి విస్తృత ప్రచారం నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చిత్రామిశ్రా, యాదిరెడ్డి, ఐసీడీఎస్ పీ.డీ రసూల్ బీ, డీఎంహెచ్ఓ డాక్టర్ సుదర్శనం, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ రమేష్, డీఎస్సీడీఓ శశికళ తదితరులు పాల్గొన్నారు.

# ఎంఎస్పీ మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని తీసుకురావాలి

ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య

నవతెలంగాణ-డిచ్‌పల్లి

రైతంగా ఉద్యమానికి లిఖితపూర్వక హామీని ఇచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ దాన్ని అమలు చేయక భారత రైతంగాన్ని మోసం చేశారని ఈ నెల 18 నుంచి జరగబోయే పార్లమెంట్ సమావేశంలో అన్ని రకాల పంటలకు మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని (ఎంఎస్పి) తీసుకరావాలని అఖిల భారత రైతు కూలి సంఘం ఎఐకెఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఏఐకెఎంఎస్ ఆధ్వర్యంలో మండలంలోని మెంట్రాజ్ పల్లిలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేల్పూర్ భూమయ్య మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలో తెచ్చిన మూడు నల్ల చట్టాలను రద్దు చేయాలనే రైతు ఉద్యమానికి తలొగ్గిన మోడీప్రభుత్వం భారత రైతంగానికి క్షమాపణలు చెప్పి అ చట్టాలను రద్దు చేసుకుంటామని, ఎంఎస్పి మద్దతు ధరల గ్యారంటీ చట్టాన్ని తీసుకువస్తామని లిఖిత పూర్వక హామీ ఇచ్చి దాన్ని అమలు చెయ్యక రైతంగాన్ని మోసం చేశారని ఆయన ఎద్దేవా చేశారు. విద్యుత్ సవరణ బిల్లు ద్వారా వ్యవసాయ మోటార్ల వద్ద మీటర్లు పెట్టి రైతులను ముక్కు పిండి కరెంట్ చార్జీలు వసూలు చేయాలనే ఆలోచనలను మానుకోవాలని, విద్యుత్ సవరణ బిల్లు రద్దు చేయాలని అయన డిమాండ్ చేశారు. రైతులు అప్పుల సుడి గుండంలో చిక్కుకున్నారని దేశ వ్యాప్తంగా రైతుల అప్పులన్నీ మాఫీ చేసి రైతులను రుణ విముక్తులను చెయ్యాలని, పార్లమెంట్‌లో రుణ విమోచన చట్టాన్ని తీసుకరావాలని పేర్కొన్నారు. రైతంగా సమస్యల పరిస్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక చట్టాలకు నిరసనగా రాబోయే రోజుల్లో రైతులతో ఐక్య ఉద్యమాన్ని నిర్మిస్తామని భూమయ్య హెచ్చరించారు. సమావేశం లో ఎఐకెఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి బి. దేవాస్వామి, నాయకులు సాయిలు, గంగారాం, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఫిష్ మార్కెట్‌కోసం స్థల పరిశీలన

నవతెలంగాణ-కంఠేశ్వర్

అర్సపల్లిలో గల ఫిషరీస్ సొసైటీ స్థలం లో 2 కోట్ల తో త్వరలో నిర్మించబోయే హెూల్ సేల్ ఫిష్ మార్కెట్ కోసం రాష్ట్ర ఫిషరీస్ జాయింట్ డైరెక్టర్ శంకర్ రాథోడ్, నిజామాబాద్ జిల్లా ఫిషరీస్ డీఎఫ్ఓ నరసింహారావు, సంఘ నాయకులు సోమవారం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎం ఎల్ సి కల్వకుంట్ల కవిత, మత్స్య శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, రోడ్లు భవనాల శాఖ మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎంఎల్ఏలు పాల్గొంటున్నారు. తరువాత ఫిషరీస్ ఆఫీసు జిల్లా కలెక్టరేట్‌లో జాయింట్ డైరెక్టర్ శంకర్ రాథోడ్ డీఎఫ్ఓ నరసింహారావు ల కు సంఘ పక్షాన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం నగర అధ్యక్షులు పల్లికొండ అన్నయ్య, గంగపుత్ర సంఘం న్యాయ సలహా దారులు దుబ్బాక రవి, డిఎఫ్‌సిఎస్ మాజీ డైరెక్టర్ బట్టు నరేందర్, డిసిసిబి డైరెక్టర్ కె.ఆనంద్, మిట్టపల్లి ఎంపిటిసి బాలగంగాధర్, గంగపుత్ర ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సోయా పంటను పరిశీలించిన వ్యవసాయ సిబ్బంది

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


సోయాపంటను పరిశీలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

మండలంలోని బషీరాబాద్ గ్రామంలో సోయా పంటను వ్యవసాయ విస్తీర్ణ అధికారిని పద్మ సోమవారం సందర్శించి పరిశీలించారు. ఇటీవల గ్రామంలో పలువురు రైతులు తెగుళ్ల సోకి సోయా పంటలో కాయ పట్టకపోవడంతో దున్నేశారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ సక్కారం అశోక్ తో కలిసి విస్తీర్ణ అధికారిని పద్మ సోయా పంటను దున్నేసిన గ్రామానికి చెందిన రైతు నర్రా గంగాధర్ తోటను సందర్శించి పరిశీలించారు. తెగుళ్ల సోకి కాయ రాకపోవడంతో పంటలు దున్నేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దానికి నష్ట పరిహారం ఇప్పించాలని ఈ సందర్భంగా పలువురు రైతులు విస్తీర్ణ అధికారిని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతి భారీ వర్షాలు పడడం వలన సోయా పంటలో తెగుళ్ల సోకి కాయ పట్టా లేదన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని రైతులకు తెలిపారు.ఈ కార్యక్రమంలో రైతులు తోట అప్పయ్య, శక్కారం నారాయణ, రాజు, నారాయణ, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత

నవతెలంగాణ-బాల్కొండ/మోర్తాడ్

ఒక వ్యక్తి పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను సిఈఐఆర్ సిస్టం ద్వారా ట్రేస్ చేసి సోమవారం బాధితునికి సెల్ ఫోన్ అప్పగించామని ఎస్సై కే. గోపి తెలిపారు. మండల కేంద్రానికి చెందిన పోల్స కుల్వార్ హనుమాన్ లింగన్న ఆగస్టు 20 న కిసాన్ నగర్ నుండి బాల్కొండ గ్రామానికి ద్విచక్ర వాహనంపై వస్తుండగా తన సెల్ ఫోను పోగొట్టుకున్నాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి సెల్ ఫోన్‌ను పట్టుకొని బాధితునికి అప్పగించారు.

**మోర్తాడ్:** మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రాచర్ల గంగు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సోమవారం ఎస్ఐ అనిల్‌రెడ్డి అందజేశారు. గంగు రహదారిపై సెల్ఫోన్ పోగొట్టుకోగా బాధితురాలు ఫిర్యాదు మేరకు విచారణ జరిపి బాధితురాలు ఫోన్‌నను ప్రత్యేక యాప్ ద్వారాకనుక్కొని బాధితులకు అందివ్వడం జరుగుతుందని ఎస్ఐ తెలిపారు.

## తెగులుతో దిగులు చెందొద్దు

మండల వ్యవసాయ అధికారి జోత్స్న భవాని



నవతెలంగాణ-నందిపేట్

వాతావరణ పరిస్థితుల మూలంగా సోయా పంటకు తెగుళ్ల సోకి తీవ్ర నష్టం వాటిల్లుతోందని మండల వ్యవసాయ అధికారిని జోస్న భవాని అన్నారు. తీవ్రమైన ఎండలు , వర్షబావ పరిస్థితులు ఎదురవడంతో చీడపీడలు ఎక్కువైనట్లు ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా సోయా పంటలో పల్లాకు తెగులు, కాండం కుళ్ళు తెగులు ఆశించడంతో దిగుబడి తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రారంభ దశలోనే తగు చర్యలు తీసుకోవాలని రైతులకు ఆమె సూచించారు. మండలంలో సోయా పంటలను సోమవారం ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా నివారణకు చర్యలు వివరించారు.

కాండం కుళ్ళు తెగులు నివారణకు కాపర్ ఆక్సీ క్లోరైడ్ 3 గ్రా .లీటరు నీటికి కలిపి మొక్క మొదలు తడిచేలా చూడాలన్నారు. లేదా ట్రైఫాక్సి స్ట్రోబిన్ లేదా టెబు కొనజల్ 0.4 గ్రామ లీటరు నీటికి కలిపి పిచికారీ చెయ్యాలన్నారు.

పల్లాకు తెగులు తెల్ల దోమ ద్వారా వ్యాప్తి చెందుతుందని మొక్క ఆకులు పసుపు రంగులోకి మారుతాయని అన్నారు. ఇలాంటి సూచనలు ఉన్నట్లయితే డైపెన్త్రీయాన్1.25 ఎంఎల్ తో పాటు నీమ్ అయిల్ 5 ఎం ఎల్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేసుకోవచ్చున్నారు.

కాండం ఈగ నివారణకు క్లోరంట్రానిల్ ప్రోల్ లామ్డా సైహలోత్రిన్ 0.4 మీ.లి మందును లీటరు నీటిలో కలుపుకొని పిచికారి చేసి పంటను కాపాడుకోవచ్చని తెలిపారు. రైతులు పాల్గొన్నారు.

## మహిళ అదృశ్యం

నవతెలంగాణ-మోపాల్



మండలంలోని సిర్పూర్ గ్రామానికి చెందిన గుమ్ముల బాగిర్తి అనే మహిళ(49) నాలుగు రోజుల నుండి కనబడుటలేదని ఎస్సై ఎల్. రామ్ తెలిపారు. ఫోన్ చేస్తే స్విచ్ ఆఫ్ వస్తుందని గ్రామంలో, చుట్టుపక్కల గ్రామాల్లో వెతికినా కూడా ఆచూకీ దొరక లేదని అన్నారు. సోమవారం బాగిర్తి కూతురి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

## రాబోయే సమాజానికి కొత్త సంస్కృతి అందించేది ఉపాధ్యాయుడు

- ఆక్స్‌ఫర్డ్ విద్యాసంస్థల అధినేత మాసన గణేష్

నవతెలంగాణ-ఆర్మూర్



ఉపాధ్యాయుడు ఒక నిత్య చైతన్య శీలియై రాబోయే సమాజానికి ఒక కొత్త సంస్కృతిని అందించే శక్తి స్వరూపం అని మానస ఆక్స్ఫర్డ్ విద్యాసంస్థల అధినేత మానస గణేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపినారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుడు ఒక కళాకారుడు. తరగతి గదిలో మార్పును బోధనతో తీసుకురావాలి. అందుకు ప్రధాన సాధకుడు ఉపాధ్యాయుడు అని అన్నారు. అంబేద్కర్ అన్నట్లు 'విద్య ద్వారా సమాజ పరివర్తన తీసుకురావాలి. సమాజ పరివర్తనను తరగతి గది నుంచి జరిపే సామాజిక శాస్త్రవేత్త ఉపాధ్యాయుడు. అందుకే ఉపాధ్యాయున్ని సోషల్ ఇంజినీర్ అంటారు. ఈ లక్షణాలన్నింటినీ పుణికిపుచ్చుకొని గత తరంలో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన ఆదర్శపురుషులు, మహానుభావులు మహాత్మజ్యోతి బాపూలే, సావిత్రిబాయి పూలే, సర్వేపల్లి రాధాకృష్ణన్, ఏపిజె అబ్దుల్ కలాం వంటివారు ముందువరసలో ఉన్నారు అని మానస గణేష్ తెలిపారు.

## స్వర్ణకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

నవతెలంగాణ-బాల్కొండ

ఉపాధి కోల్పోతున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలకోవాలని స్వర్ణకారులు కోరారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బాల్కొండలో స్వర్ణకార దుకాణాలు ఒక రోజు మూసివేశారు. అనంతరం బాల్కొండ తహసీల్దార్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్వర్ణకార దుకాణం దారులు పాల్గొన్నారు.

# కులసంఘాలకు ప్రొసీడింగ్ కాపీలు అందజేత

నవతెలంగాణ-బాల్కొండ


బాల్కొండ : ప్రొసీడింగ్ పత్రాలు అందజేస్తున్న మంత్రి


ఏర్గట్ల : కులసంఘ సభ్యులకు ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న మంత్రి


కమ్మర్‌పల్లి : కులసంఘ సభ్యులకు ప్రొసీడింగ్ కాపీ అందజేస్తున్న మంత్రి

వేల్పూర్‌లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో సోమవారం బాల్కొండ మండల పరిధిలోని పలు గ్రామాలకు మంజూరైన వివిధ కులసంఘాల భవనాల నిర్మాణాల నిధుల ప్రొసీడింగ్ కాపీలను ఆయా కులసంఘాల సభ్యులకు మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా బాల్కొండ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ బోదేపల్లి గ్రామంలో అదనపు పని కుర్మ సంఘంకు 3.50 లక్షలు, అదనపు గది బీరప్ప దేవాలయం 3.50 లక్షలు, గంగపుత్ర సంఘం కమ్యూనిటీ హాల్ 4.50 లక్షలు, చిట్టాపూర్ గ్రామంలో అదనపు పనులు కుర్మ సంఘంకు 5 లక్షలు, కిసాన్ నగర్ గ్రామంలో అదనపు పని గౌడ కమ్యూనిటీ హాల్‌కు 5 లక్షలు, మండల మోచి సంఘం కమ్యూనిటీ హాల్‌కు 5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

**ఏర్గట్ల:** మండలంలోని తొర్తి గ్రామ నాలుగు కుల సంఘాల భవన నిర్మాణాల కోసం మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రొసీడింగ్ కాపీలను సోమవారం అందజేశారు. విశ్వ బ్రాహ్మణ సంఘానికి 4 లక్షలు, మున్నూరు కాపు-1 సంఘానికి 4 లక్షలు, మున్నూరు కాపు 2 సంఘానికి 4 లక్షలు, మున్నూరు కాపు-3 సంఘానికి 5 లక్షల రూపాయలు అందించినట్లు సంఘ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, సర్పంచ్ కుండ నవీన్, ఆకుల రాజారెడ్డి, వేశాల నర్సారెడ్డి, ఆకుల రాజేంధర్,జక్కు గంగాధర్ పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లి:** మండలంలోని పలు గ్రామాల కులసంఘాల భవనాల నిర్మాణాల నిధుల ప్రొసీడింగ్ కాపీలను రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సోమవారం అందజేశారు.వేల్పూర్ లోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో ఆయా కులసంఘాల సభ్యులకు మంత్రి అందజేశారు. చౌట్ పల్లిలో ఎస్సీ సంఘం కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం రూ.5లక్షలు, గంగపుత్ర సంఘం అదనపు పని కోసం రూ.5లక్షలు, కమ్మర్ పల్లిలో వంజరి సంఘం అదనపు పని కొరకు రూ. 4లక్షలు, నాయి బ్రాహ్మణ సేవా సంఘం కమ్యూనిటీ హాల్ కొరకు రూ. 3.50 లక్షలు, ముదిరాజ్ నడిమి వాడకట్టు సంఘం కొరకు రూ. 4.50 లక్షలు, ముదిరాజ్ నాగండ్ల సంఘం కొరకు రూ. 4.50 లక్షలు, సింగిల్ విండో కార్యాలయం వద్ద ఫర్టిలైజర్ గోడౌన్ నిర్మాణం కోసం రూ.10లక్షల మిధున మంజూరు పత్రాలను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, కమ్మర్ పల్లి సింగిల్ విండో చైర్మన్ రేగుంట దేవేందర్, ఎంపీటీసీ మైలారం సుధాకర్, విండో డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

## కాలువలో చెత్తను తొలగించిన సర్పంచ్



**నవతెలంగాణ-వర్ని**

మండల కేంద్రంలోని గత రాత్రి నుంచి పెద్ద ఎత్తున వర్షాలు కురుస్తుండతంలో చెత్త మురికి కాలువలో చేరడంతో గ్రామంలోని ఇండ్లలోకి నీరు రాకుండా చందూర్ సర్పంచ్ సాయరెడ్డి జేసీబీలతో చెత్తను తొలగించారు. దీంతో కాలనీలో నీరు నిలువకుండా చేశారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందున పాత ఇండ్లల్లో ఉండే వారు సమాచారం ఇవ్వాలని, టోల్ ఫ్రీ నెంబర్లు ఏర్పాటు చేశారు.

## అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి



**నవతెలంగాణ-భిక్కనూర్**

విశ్వవిద్యాలయాలలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలని కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నారాయణ గుప్తా తెలిపారు. సోమవారం మండలంలోని బిటిఎస్ వద్ద ఉన్న సౌత్ క్యాంపస్‌లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 105 రోజుల నుంచి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేదని, ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ అధ్యాపకులు రమాదేవి, నరసయ్య, నిరంజన్, శర్మ, వైశాలి, దిలీప్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నారు సాగు.. ఆదాయం బాగు..

**పొగాకు నారును సాగు చేసి.. నారు చేతికి వచ్చాక పొగాకు సాగుచేసే రైతులకు విక్రయించి ఆదాయం గడిస్తున్నారు. నారు సాగుచేసినప్పటి నుంచి చేతికివచ్చేవరకూ కంటికి రెప్పలా కాపాడుతూ.. ఎకరాల చొప్పున నారును విక్రయిస్తూ.. లాభాలు పొందుతున్నారు ఆదర్శంగా నిలుస్తున్నారు రెంజల్ మండల రైతులు.**

## ఏండ్లుగా పొగాకు సాగు చేస్తున్న రైతులు

- కంటికి రెప్పలా కాపాడుతూ.. లాభాలు గడిస్తూ..
- ఆదర్శంగా నిలుస్తున్న రెంజల్ మండల రైతులు

**నవతెలంగాణ-రెంజల్**

రెంజల్ మండలంలోని పలు గ్రామాల్లో సుమారుగా 5000 ఎకరాలలో పొగాకు పంటను రైతులు ప్రతియేటా సాగుచేస్తుంటారు. అయితే ఆ పంటను సాగుచేసేందుకు గానూ.. కొందరు ప్రత్యేకంగా కేవలం పొగాకు నారునే సాగుచేసి విక్రయిస్తున్నారు. రెంజల్ మండలం నీలా గ్రామంతో పాటు, పలు గ్రామాలకు చెందిన సుమారు 15 మంది రైతులు పొగాకు నారును సాగుచేసి విక్రయిస్తున్నారు.



**సాగు ఇలా..**

గత ఆరు సంవత్సరాలుగా పొగాకు నారుపై ప్రత్యేక దృష్టిని సారించి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ లాభాలను గడిస్తున్నారు. దుక్కి దున్ని, నేలను చదును చేసిన తర్వాత వాటిని పెద్ద మల్లుగా తయారు చేసి దానిపై సిమెంట్ పైపుతో చదును చేస్తారు. ఆ తరువాత పొగాకు విత్తనాలను ఇసుకలో కలిపి చల్లుతారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే లాభదాయకంగా ఉంటుంది. అయితే వాతావరణం సహకరించపోతే నారు చనిపోయిన స్థలంలో తిరిగి విత్తనాలు చల్లుతారు. నారు పంట చేతికి వచ్చాక పొగాకు సాగుచేసే రైతులకు నారును విక్రయిస్తారు. నారును ఎకరాకు 5 వేలమొక్కల నుంచి 7500 మొక్కలను నాటుతారు. అందుకు గానూ నారును సాగుచేసిన రైతులు మూడు వేల రూపాయలకు విక్రయిస్తారు.


దుక్కి దున్ని పొగాకు నారు వేసే వరకు సుమారుగా రూ.70 వేల వరకు ఖర్చవుతుందని, అదనంగా ప్రతిరోజు ఏదో ఒక మందును పిచికారీ చేయాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. పొగాకు నారు సాగులో కొద్దిగా నిర్లక్ష్యం చేసినా పంట చేతికి రాకుండా పోతుందని నారు సాగు చేసే రైతులు చెబుతున్నారు. నారుమడిలో గడ్డిని తొలగించడానికి మహిళలకు రోజుకు రూ.280 ఇవ్వవలసి వస్తుందని, చీడపీడల నివారణకై వివిధ రకాల మందులను పిచికారీ చేయవలసి ఉంటుందని రైతులు చెబుతున్నారు.



సాగుచేసిన పొగాకు నారు

గతంలో వీఎస్‌టీ యాజమాన్యం విత్తనాలను సరఫరా చేసేవారని, ప్రస్తుతం తాము పండించిన పంటలోని ఏపుగా పెరిగిన మొక్కలను అలాగే ఉంచి వాటి నుంచి విత్తనాలను సేకరించి పొగాకు నారును సాగుచేస్తున్నామని రైతులు అంటున్నారు. పొగాకు పంట చేతికి వచ్చిన తర్వాత ఎక్కువ పువ్వులు కలిగిన వాటిని అలాగే ఉంచి, వాటి ద్వారా విత్తనాలను సేకరిస్తారు. అక్కడక్కడ ఎండిపోయిన మల్లను గుర్తించి తిరిగి విత్తనాలు చల్లుతారు. నారు సాగు పంట ఆశాజనకంగా ఉంటే లక్ష నుంచి లక్ష ఇరవై వేల రూపాయల వరకు లాభం చేకూరుతుందని రైతులు చెబుతున్నారు.

### కంటికి రెప్పలా కాపాడుతాం



పొగాకు నారు పండించే సమయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రతిరోజు కంటికి రెప్పలా కాపాడుతాం. దాంతోనే లాభాలు వస్తాయి. వ్యవసాయ అధికారుల సూచనల మేరకు పంటకు రెండు రోజులకోమారు తగిన మందులను పిచికారీ చేయాల్సి వస్తుంది.

**- షేక్ లతీఫ్ (రైతు), నీల గ్రామం.**

## కాంట్రాక్ట్ ఏఎన్ఎంల సమ్మె తాత్కాలిక వాయిదా



కలెక్టరేట్‌కు తరలివచ్చిన కాంట్రాక్ట్ ఏఎన్ఎంలు

**నవతెలంగాణ-కంఠేశ్వర్**

కాంట్రాక్టు ఏఎన్ఎంల సమ్మె తాత్కాలిక వాయిదా వేసినట్టు సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ తెలియజేశారు. సోమవారం డిఎంహెచ్‌ఓకు వినతిపత్రం అందజేశారు. డీఎంఅండ్‌హెచ్‌వో సానుకూలంగా స్పందించి పీహెచ్‌సీలల్లో జాయిన్ కావాలని సూచించినట్టు తెలిపారు. అనంతరం నూర్జహాన్ మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎఎన్ఎంలను యధావిధిగా రెగ్యులర్ చేయాలని, రాత పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15 నుంచి సమ్మె కొనసాగగా, ప్రభుత్వంతో పలు దఫాలుగా చర్చలు జరిగాయని, చివరిగా ఈ నెల 1వ తేదీనా జరిగిన చర్చల్లో సమస్యల పరిష్కారానికి కమిటీ వేస్తామని చెప్పారని, దానికి అనుగుణంగా శనివారం ముగ్గురు సభ్యుల కమిటీ ఏర్పాటుకు ఉత్తర్వులు జారీఅయినందున సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేసినట్టు తెలిపారు. సమ్మె కాలంలో ఏమైనా క్రమశిక్షణా చర్యలు ఉంటే ఉపసంహరించుకోగలరని కోరుతూ, ప్రభుత్వం ఏఎన్ఎం లకు న్యాయం చేయలేకపోతే మరలా పోరాటాలు చేస్తామని ఆమె స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో పుష్ప జమున కవిత సరోజా. ధన. సావిత్రి, వరమ్మ రాణి విజయలక్ష్మి, గంగ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె

- తహశీల్దార్‌కు అంగన్వాడీ టీచర్ల వినతి

**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

తమ సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె చేస్తామని అంగన్‌వాడీ టీచర్లు హెచ్చరించారు. మండల కేంద్రంలో సోమవారం తహసీల్దార్ దశరథ్‌కు మండల అంగన్వాడీ టీచర్లు వినతిపత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షురాలు విజయ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో అంగన్వాడీ టీచర్లుగా పనిచేస్తున్న తమ సమస్యలను ఈ నెల 10లోపు ప్రభుత్వం పరిష్కరించకుంటే 11 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె నోటీసును అందజేశారు. అంతే కాకుండా ప్రభుత్వం అంగన్వాడీ టీచర్లను పర్మినెంట్ చేస్తూ నెలకు రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో పాటుగానే పింఛన్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. టీచర్లకు రూ.10లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్, హెల్పర్లకు 5 లక్షలు చెల్లించాలని, రిటైర్మెంట్ వయస్సు 60 సంవత్సరాలు పెంచి విద్యార్హత ఉన్నవారికి పదోన్నతి కల్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కమల, పద్మ, సునీత తదితరులు పాల్గొన్నారు.

## నిన్న కాంగ్రెస్.. నేడు బీఆర్ఎస్



**నవతెలంగాణ-ఎల్లారెడ్డి**

గత రెండు రోజుల క్రితం నేరల్ సర్పంచ్ బి.ఆర్.ఎస్ పార్టీని వీడి మదన్‌మోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా.. ఆదివారం రాత్రి తిరిగి ఎమ్మెల్యే జాజాల సురేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

## పెళ్లికూతురికి పెళ్లి వస్త్రాలు వితరణ

**నవతెలంగాణ-భిక్కనూర్**

మండలంలోని మోటాటిపల్లి గ్రామంలో రెడ్డయ్య లావణ్య దంపతుల కుమార్తె సుస్మిత వివా హ సంద ర్భంగా సర్పంచ్ మోటాటి రాజేశ్వరి రాజిరెడ్డి నూతన పెళ్లి వస్త్రాలను వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అంజనీ గ్రామానికి చెందిన విద్యార్థికి ఎంబీబీఎస్‌లో సీటు



**నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్**

మండలంలోని అంజనీ గ్రామానికి చెందిన విద్యార్థికి ఎంబీబీఎస్‌లో సీటు లభించింది. వరంగల్ కాలోజీ యూనివర్సిటీ విడుదల చేసిన ఎంబీబీఎస్ ప్రవేశ పరీక్షల్లో ఆ విద్యార్థి సీటు సాధించాడు. ఎంబీబీఎస్‌లో మంచి ర్యాంకు రావడంతో అధికారులు రఘునాథ్‌కు సిద్దిపేట్ సురభి మెడికల్ కళాశాలలో సీటు కేటాయించారు.

కామారెడ్డి జిల్లాలోని మారుమూల గ్రామమైన అంజనీ నుంచి రఘునాథ్ సీటు సాధించడంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రఘునాథ్ తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తూ తన కొడుకు చదివించారు. రఘునాథ్ 1 నుంచి 5వ తరగతి వరకు పిట్లం బ్లూబెల్స్ పాఠశాలలో, 6 నుంచి 10 వరకు నిజాంసాగర్ జవహర్‌లాల్ నవోదయ, ఇంటర్ ఇంపల్స్ హైదరాబాద్‌లో చదివాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన రఘునాథ్‌కు ఎంబీబీఎస్ సీటు రావడంతో తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎంబీబీఎస్ సీటు సాధించిన రఘునాథ్‌ను ఎంపీపీ ప్రతాపరెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ.. ఎంబీబీఎస్ తర్వాత మారుమూల గ్రామాల్లో వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని తెలిపారు.

## మండలంలో 24 మందికి 'బీసీ ఆర్థికసాయం' మంజూరు

**నవతెలంగాణ-రామారెడ్డి**

మండలంలో 24 మందికి బీసీ బంధు మంజూరైనట్లు అధికారులు సోమవారం తెలిపారు. మండలంలోని కామారెడ్డి నియోజకవర్గ గ్రామాలైన అన్నారం 2, రెడ్డిపేట 1, ఎల్లారెడ్డి నియోజకవర్గ గ్రామాలైన గిద్ద 3, ఇస్సన్నపల్లి 1, కన్నాపూర్ 1, పోసానిపేట్ 4, రామారెడ్డి 10, ఉప్పల్వాయి 2 మంజూరైనట్టు వివరించారు.

## గర్భిణుల, బాలింతల, పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**నవతెలంగాణ-తాడ్వాయి**

గర్భిణీ స్త్రీలు, బాలింతలు, పిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బలవర్ధకమైన పౌష్టికాహారం అందించాలని, సకాలంలో ఇమ్యునైజేషన్ జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. పోషన్ మాసోత్సవంలో భాగంగా ఈ నెల 1 నుంచి 30 వరకు షెడ్యూల్ ప్రకారం చేపడుతున్న కార్యక్రమాలను విజయవంతం చేయుటకు సంబంధిత అధికారులు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. పోషన్ మాసోత్సవంలో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలపై మహిళా శిశు సంక్షేమం అనుబంధ శాఖలతో ఏర్పాటు చేసిన సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మనుచౌదరితో కలిసి మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, శిశువుల ఆరోగ్యం కోసం తీసుకోవలసిన సమతుల పౌష్టికాహారం, తల్లిపాల ఆవశ్యకత, కిశోర బాలికలలో రక్తహీనతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. రోజువారీగా చేపట్టే మాసోత్సవ కార్యక్రమాలలో ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, స్వయం సహాయక సంఘం సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని సమతుల ఆహారానికి పాలు, గుడ్లు, చిరుధాన్యాల ఆవశ్యకతను వివరించాలన్నారు. కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేయాలని సూచించారు. రక్తహీనతపై పాఠశాల స్థాయిలో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓకు సూచించారు.



గోడప్రతులను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

పిల్లల ఎత్తు, బరువులు పరీక్షించి తీవ్ర పోషక లోపం ఉన్న పిల్లలు (సామ్), వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లోపం (మామ్) ఉన్న పిల్లలను గుర్తించి గుడ్లు, బాలామృతం తీసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కలిగించాలన్నారు. ఎంతో పోషక విలువలు కలిగిన చిరుధాన్యాల పట్ల వ్యవసాయ విస్తరణాధికారుల ద్వారా అంగన్వాడీ కేంద్రాలలో అవగాహన కల్గించాలని జిల్లా వ్యవసాయాధికారికి సూచించారు. బుధ, శనివారాలలో ఆరోగ్య కార్యకలాపాలు చూడాలని డిఎమ్అండ్‌హెచ్‌ఓకు సూచించారు. గిరిజన, మైనారిటీ, జిల్లా పౌర సరఫరాలు తదితర శాఖలు కూడా తమ కార్యకలాపాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి శాఖ కూడా ఎటువంటి ఫిర్యాదులకు తావులేకుండా కార్యాచరణ మేరకు నాణ్యతా ప్రమాణాలకనుగుణంగా కార్యక్రమాలు నిర్వహించాలని హితవు చెప్పారు. చేసిన ప్రతి కార్యక్రమం డాక్యుమెంటేషన్‌లో ఉండేలా చూడాలని, నాటి పనిని ఆన్‌లైన్‌లో ఫోటోతో పాటు వివరాలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. భేటీ బచావో భేటీ పడావో పథకాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయుటకు తుది కార్యాచరణ రూపొందించవలసినదిగా అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ రక్తహీనత, సమతుల పౌష్టికాహారంపై తీసుకోవలసిన జాగ్రత్తలపై రూపొందించిన గోడప్రతులను కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధికారులు సాయన్న, బావయ్య, లక్ష్మణ్‌సింగ్, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, అనిల్‌కుమార్, నవీన్, రమేష్‌బాబు, షహీన్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

## జక్రాన్‌పల్లి ఎంపీడీవో నటరాజ్ సస్పెన్షన్

- లైంగికదాడికి పాల్పడ్డ నిందితుడిని కఠినంగా శిక్షించాలి : కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న నాయకులు

**నవతెలంగాణ-ధర్పల్లి/జక్రాన్‌పల్లి**

జక్రాన్‌పల్లి ఎంపీడీవో నటరాజ్‌ను సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలోధర్పల్లి మండలంలో విధులు నిర్వహిస్తున్న సమయంలో ఓ గిరిజన మహిళపై లైంగికదాడికి పాల్పడినట్టు ఫిర్యాదు అందడంతో ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. గత నెల 8న బాధిత మహిళా తన కుటుంబ సభ్యులతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయంతెలిసిందే. 10వ తేదీనా పోలీసులు కేసు నమోదు చేయగా.. అప్పటి నుంచి పరారీలో ఉన్నట్టు సమాచారం.

నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ బంజారా నాయకులు సోమవారం కలెక్టరేట్‌కు తరలివచ్చి ఫిర్యాదు చేశారు. బంజార జిల్లా నాయకులు ఏబిఎస్ఎస్ అధ్యక్షుడు రామావత్ మోహన్ నాయక్, ఎస్సి వర్గీకరణ జిల్లా అధ్యక్షుడు బంగారు సాయిలు ఆధ్వర్యంలో బాధితులు జిల్లా కలెక్టర్ రాజీవ్ హన్మంతుతో కలిసి బంజార మహిళపై అఘాయిత్యానికి పాల్పడిన ఎంపిడిఓ నటరాజ్ ను సస్పెండ్ చేసి,వెంటనే అరెస్ట్ చెయ్యాలని కోరారు. నటరాజ్‌ను సస్పెన్షన్ చేసినట్లు, అలాగే ఏసీపీతో మాట్లాడి కఠినమైన చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు బాధిత మహిళా కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరము వారు డీఎస్పీకి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నూడా డైరెక్టర్ శ్రీహరి నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మోహన్ నాయక్ చౌహన్,నిజామాబాదు మండల ఎంపీపీ బానోత్ ప్రేమ్ నాయక్, మోపాల్ నాయకులు సంగ్యా నాయక్, బానోత్ గోపాల్ నాయక్,లాల్ సింగ్ నాయక్,శంకర్ నాయక్,శివరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# జుక్కల్ నియోజకవర్గానికి నిధులు మంజూరు

- రూ.37 కోట్ల 32 లక్షలు మంజూరు చేసిన ప్రభుత్వం
- జుక్కల్ ఎమ్మెల్యే హనుమంత్ షిండే

**నవతెలంగాణ-బిచ్కుంద**

జుక్కల్ నియోజకవర్గంలోని ఇంటర్ డిస్టిక్ కనెక్టివిటీ, బీటీ రోడ్ల బ్రిడ్జిల నిర్మాణం కోసం జీవో నెంబర్ 368 ద్వారా సోమవారం 37 కోట్ల 32 లక్షలు నిధులు మంజూరయ్యాయని జుక్కల్ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్యానల్ స్పీకర్ హనుమంత్ షిండే అన్నారు. బిచ్కుంద మండల కేంద్రంలోని ఎమ్మెల్యే హనుమంత్ షిండే నివాసంలో విలేకరులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జుక్కల్ మండలంలో సోఫూర్ నుండి మహారాష్ట్ర సరిహద్దు వరకు 2 కోట్లు, చండేగాం నుండి మహారాష్ట్ర సరిహద్దు వరకు 2 కోట్లు, గుండూర్ నుండి మహారాష్ట్ర సరిహద్దు వరకు 1 కోటి 40 లక్షలు, శక్తినగర్ నుంచి కర్ణాటక సరిహద్దు వరకు 1 కోటి 50 లక్షలు, చండేగాం నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు 1 కోటి, మద్నూర్ మండలంలోని గోజేగౌవ్ నుండి మహారాష్ట్ర సరిహద్దు వద్ద వరకు 1 కోటి 40 లక్షలు, పెద్దశక్కర్గగా నుండి మహారాష్ట్ర సరిహద్దు వరకు 1 కోటి 80 లక్షలు, హండెకల్లూరు నుండి భక్తాపూర్ వరకు 2 కోట్ల యాభై లక్షలు తడ్గూర్ జెడ్పీ రోడ్డు నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు 80 లక్షలు, ఇంటర్ స్టేట్ కనెక్టివిటీ రోడ్ల నిర్మాణం కొరకు మొత్తం 14 కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ నుంచి బ్రిడ్జిల నిర్మాణం కోసం 13 కోట్ల 60 లక్షలు మంజూరు కాగా ఇందులో బిచ్కుంద మండలంలోని హస్గుల్ గ్రామం నుండి కిష్టాపూర్ వరకు 5 కోట్ల 40 లక్షలు, మద్నూర్ మండలంలోని పెద్దతడ్గూర్, కోడిచిర మధ్య 1 కోటి 20 లక్షలు, నిజాంసాగర్ మండలంలోని గున్కుల్ గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మాణానికి 6 కోట్లు, కొమలాంచ గాలిపూర్ మధ్య 1 కోటి రూపాయలు, మంజూరయ్యాయని తెలిపారు. బీటీ రోడ్ల నిర్మాణం కోసం తొమ్మిది కోట్ల 72 లక్షల మంజూరు కాగా మార్దండ నుంచి అంతర్గాం సంగారెడ్డి జిల్లా సరిహద్దు వరకు 1 కోటి 15 లక్షలు, పిట్లం నుండి కల్హేర్ సంగారెడ్డి సరిహద్దు వరకు 1 కోటి 82 లక్షలు, కంబాపూర్ నుండి జిల్లా సరిహద్దు వరకు 1 కోటి 30 లక్షలు, నిజాంసాగర్ మండలం ఆరేపల్లి జిల్లా పరిషత్ రోడ్డు నుండి నిజాంసాగర్ గేట్ల వరకు 70 లక్షలు, పెద్దకొడప్‌గల్ మండలంలోని సముందర్ తండా నుండి తడ్కుల్ తాండా వరకు 2 కోట్ల 1 లక్ష రూపాయలు విటల్వాడి తండా జిల్లా పరిషత్ రోడ్డు నుండి తడకల్ తాండా వరకు 2 కోట్ల 74 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 368 తేదీ 4/9/2023, 37 కోట్ల 32 లక్షల నిధులు మంజూరు చేసినందుకు జుక్కల్ నియోజకవర్గం అభివృద్ధికి వెన్నుదన్నుగా ఉండి నిధులు మంజూరు చేసినందుకు గానూ ప్రత్యేకంగా ముఖ్యమంత్రి కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ మంత్రులకు, ఫైనాన్స్ సెక్రెటరీ సంబంధిత శాఖల సెక్రటరీలకు ధన్యవాదాలు తెలిపారు. ఎంపీపీ అశోక్ పటేల్, బస్సీపటేల్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే